17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
అనంతపురం | శ్రీ సత్యసాయి
సోమవారం | 22 జూలై 2024 | పేజీలు 11

మానవాళికి
# సత్యసాయి సేవలు వెలకట్టలేనివి..
## హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా



పుట్టపర్తి మేజర్ న్యూస్:

భగవాన్ సత్యసాయి బాబా మానవాళికి అందించిన సేవలు వెలకట్ట లేనివని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురుపౌర్ణమి వేడుకల ను పురస్కరించుకొని ఆదివారం ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభ మందిరంలో గవర్నర్ ప్రసంగిస్తూ భగవాన్ సత్యసాయి బాబా బోధించిన బోధనలు అపరిమితమైనవని, బాబా అనుగ్రహంతో మానవుని యందు భక్తి ప్రవహిస్తుం దని, అదిమనసును తాకినప్పుడు మనిషి తన శరీర అనుభూతిని కోల్పోతారన్నారు. నరుడే నారాయణుడు.. మానవసేవే మాధవసేవ అనే సూత్రంతో ప్రపంచ దేశాలకు శాంతి సందేశాన్ని అందించి భక్తుల హృద యాలను ఆకట్టుకున్నారన్నారు. సత్యసాయి బాబా చేపట్టిన సేవా కార్యక్రమాలు చేరని గ్రామం ఉండదని, తాను చాలా రోజుల తర్వాత ప్రశాంతి నిలయంకు వచ్చానని, బాబా అనుమతితోనే రాగలనన్నారు. మనిషి జీవితంలో ఏది అవసరమో

మిగతా 02 ▸▸

## హిందూపురంలో రెచ్చిపోతున్న
# గంజాయి మాఫియా




### గంజాయి మత్తులో జోగుతున్న యువత, విద్యార్థులు

- వలస కూలీలే లక్ష్యంగా అమ్మకాలు
- మత్తుకు బానిసవుతున్న యువత
- గల్లి గల్లీలో గంజాయి విక్రయాలు
- 100 గ్రాములు కేవలం రూ.600 మాత్రమే



03 పేజీలో



రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన యువత గంజాయి మత్తులో చిత్తవుతోంది. కిక్కు కోసం, కొత్తదనం కోసం కొందరు యువకులు,విద్యార్థులు మత్తుకు అలవాటు పడి బానిసలుగా మారుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని నిషాలో తూగుతున్నారు. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయిని సేవిస్తూ ఆ కిక్కులో అడ్డదార్లు తొక్కుతూ కొందరు నేరస్తులుగానూ మారుతున్నారు.

హిందూపురం మేజర్ న్యూస్:

హిందూపురం లో గంజాయి దందా చాపకింద నీరులా మత్తుగా విస్తరిస్తోంది. పట్టణ శివార్లలో, నిర్మానుష్య ప్రాంతాల్లో కొంత మంది గంజాయి సేవించి మత్తులో జోగుతున్నారు. తుముకుంట, ముద్దిరెడ్డిపల్లి, ముక్కడిపేట, నికంపల్లి, ఆటోనగర్,తదితర ప్రాంతాల్లో విచ్చల విడిగా మత్తు దందా సాగుతోంది. పాడు పడిన భవనాలు, చెరువుల్లో, ముళ్ల పదల్లో,బ్రిడ్జిల కింద అడ్డాలు ఏర్పాటు చేసుకుని యువకులు మత్తులో తేలుతున్నారు.
కొందరు యువకులు మత్తులో మహిళలను వేధిస్తుంటే మరికొందరు దాడులకు సైతం తెగబడుతున్నారు.

# ఇదేమి విడ్డూరం?

04

### ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యం గోవిందా.. గోవిందా!!
### రక్త పరీక్షల్లో గోల్ మాల్






# ముడుపులు ఇచ్చుకో.. అనుమతులు పుచ్చుకో..




- స్కూల్ బస్ ఫిట్నెస్ ప్రశ్నార్థకం...
- కాలం చెల్లిన బస్సులకూ క్లీన్ చిట్...?
- 32 నిబంధనలు పాటించక పోయినా పైపై రంగులు వేసి రోడ్లపై తిప్పుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలు...
- ఆర్టీవో అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం...
- ప్రమాదాలు జరిగితే ఎవరిదీ బాధ్యత...
- ఫిట్నెస్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చేరా...?

మిగతా 4లో



# 116 సీట్ల భర్తీపై వీడని అనుమానాలు..!

- ఆ సీట్లలో సిఫార్సులకే పెద్దపీట... మెరిట్ అభ్యర్థులకు అన్యాయం
- నేటికి డిసిఓ కార్యాలయం చుట్టు తిరుగుతున్న విద్యార్థుల తల్లితండ్రులు
- గత ఏడాది లాగే ఇప్పుడు కూడా సీట్ల భర్తీపై కలెక్టర్ విచారణకు ఆదేశిస్తారా ?

మిగతా 8లో




## విద్యుత్ శాఖ ఎస్ఈగా కె.సంపత్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : విద్యుత్ శాఖ ఉమ్మడి అనంతపురం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా ఎట్టకేలకు కె. సంపత్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా తిరుపతి కార్పొరేట్ ఆఫీస్ లో పని చేస్తున్న సంపత్ కుమార్ ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్పీడీసీఎల్ ఎస్ఈగా నియమించారు. ఈ మేరకు రెండ్రోజుల క్రితం ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. శనివారం ఉదయమే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యోగులు విద్యుత్శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా బాధ్యతల స్వీకరణ విషయంలో కాస్త గందరగోళం ఏర్పడింది. చివరకు ఆదివారం మధ్యాహ్నం ఆయన ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలా కాలం పాటు పని చేసిన సంపత్ కుమార్ కు మంచిపేరు ఉంది. అందరితో స్నేహపూర్వకంగా ఉండడం.. పని చేసిన ప్రతి చోటా కింది స్థాయి సిబ్బందితోనూ ఎలాంటి వివాదాలు లేకుండా ఉండడం ఆయన పనితీరుకు నిదర్శనం. సంపత్ కుమార్ బాధ్యతలు స్వీకరించాక పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.డిప్యూటీ ఈఈలు శ్రీనివాసులు, వివేకానంద స్వామి, రామకృష్ణ, ఏఏఓ గంగన్న, ఫోర్మన్ గంగన్న తదితరులు ఎస్ఈ సంపత్కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇదిలా ఉండగా గతంలో సంపత్కుమార్ కదిరి ఏఈ, ఏడీఈగా సుమారు 17 ఏళ్ల పని చేశారు. ఆ తర్వాత గుంతకల్లు, హిందూపురం ఏడీఈగా పని చేశారు. ఆ తర్వాత అనంతపురం ఆపరేషన్స్, ట్రాన్స్ ఫార్మర్స్ డీఈగా పని చేసిన అనుభవం ఉంది. ప్రజలు, రైతాంగానికి మెరుగైన సేవలను అందించమే తన లక్ష్యమని ఎస్ఈ సంపత్ తెలియజేశారు.

## మానవాళికి సత్యసాయి సేవలు వెలకట్టలేనివి..

▸▸ మొదటి పేజీ తరువాయి





అదిమాత్రమే భగవంతుడిని కోరుకోవాలని, అన్నీ తెలిసిన భగవానుడు అవసరమైన వాటిని మాత్రమే భక్తులకు ప్రసాదిస్తారన్నారు. అంతకుమునుపు భగవాన్ సత్యసాయిబాబా 1973లో ప్రసంగించిన ఉపన్యాసాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం దివ్యాంగజన్ సేవా ప్రాజెక్టు ద్వారా మొబైల్ బస్సును ను ప్రారంభించారు. మహా మంగళహారతితో సాయి కుల్వంత్ సభా మందిరంలోని గురుపౌర్ణమి వేడుకలు ఉదయం కార్యక్రమం ముగియడంతో గవర్నర్ దంపతులు ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ చేరుకొని ప్రత్యేక వాహనశ్రేణిలో బెంగళూరు బయలుదేరి వెళ్లారు. శనివారం రాత్రి 11 గంటలకు గవర్నర్ దంపతులు ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ కు విచ్చేయగా వారికి సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్ తో పాటు కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్నా తదితరులు స్వాగతం పలికారు. గవర్నర్ ను కలిసిన మాజీ మంత్రి పల్లె:గురు పౌర్ణమి వేడుకలలో భాగంగా ప్రశాంతి నిలయంకు విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్ నందు ఆదివారం ఉదయం గవర్నర్ ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పుట్టపర్తి యొక్క విశిష్టతను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గవర్నర్ కు వివరించారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : అనంతపురం హెచ్ ఎల్సి కాలనీలోని శ్రీ స్వామి సమర్థ అక్కలకోట మహారాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆశ్రమంలోని పరివార దేవతలకు గురువులకు వేద మంత్రాలతో పవిత్ర జలాలతో అభిషేకాలను నిర్వహించారు.. ఆదిదేవుడు గణపతి పూజ తో ప్రారంభించారు శ్రీ దత్తాత్రేయ , శిరిడి సాయిబాబా గురువులకి అభిషేకం, అష్టోత్తర నామాలు ను పఠిస్తూ పుష్ప అభిషేకాలను చేశారు. వివిధ సర్వంగ సుందరంగా అలంకరించారు.మాస్టర్ సాయి హర్షిత్ బృందం చే భజన ఆధ్యాత్మికత సంచరించుకోంది.మధ్యాహ్నం మహా మంగళహారతి తీర్థ ప్రసాద వితరణ చేశారు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు కొల్హాపూర్ మహాలక్ష్మి, ఫోటో యంత్రమును ఉచితంగా ఆలయ నిర్వహణ కార్యదర్శి విజయకుమార్ పంపిణీ చేశారు.





## హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు...

### రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభించిన... ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె మేజర్ న్యూస్ : మండల కేంద్రంలోని ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీలో పోరా హోరీగా సాగాయి. ఈ పోటీలను సింగనమల దిసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, కట్టప్ప గారి రామలింగారెడ్డి గాండ్ల విశాలాక్షి ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 జాతులు ఎద్దులు పాల్గొన్నాయి. అనంతరం గేట్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాతి దూలం లాగుడు పోటీలు చూడటానికి వచ్చినటువంటి ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి బహుమతి గార్లదిన్నె గ్రామానికి చెందిన రామాంజనేయులు చెందిన ఎద్దులు 3269.8 అడుగులు లాగి మొదటి బహుమతి 50,000 వేలు రూపాయలు ముంటిమడుగు కేశవరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రెండవ బహుమతి మేడు మాకులపల్లి కి చెందిన పవన్ కుమార్ రెడ్డి ఎద్దులు3250 అడుగులు లాగి 40 వేల రూపాయలు రామలింగారెడ్డి అందజేశారు. మూడో బహుమతి గార్లదిన్నె గ్రామానికి చెందిన రమేష్ ఎద్దులు 3186 అడుగులు లాగి 30000 వేలు రూపాయలు ను గాండ్ల విశాలాక్షి బహుమతిగా అందజేశారు. తోపుదుర్తికి చెందిన కే చెన్నప్ప ఎద్దులు 3000 వేలు అడుగులు లాగి మూడు బహుమతి 20000 వేలు రూపాయలు దక్కించుకున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ఓబుల్ పతి ఆచారి ఎద్దులు 2,750అడుగులు లాగి నాలుగో బహుమతి మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ పదివేల రూపాయలు అంద జేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ నందు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గేట్ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ బోలెపాండు, ఇల్లూరు రామాంజనేయులు, బాలకృష్ణ, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యుని ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉరవకొండ, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని ప్రసిద్ధ బూదగవి సూర్యనారాయణ స్వామి ఆలయములో ఆదిత్యునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రకాష్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం వేకువ జామునే సూర్యనారాయణ స్వామి మూలమూర్తికి పంచామృత అభిషేకం నిర్వహించి, అనంతరం తైలాభిషేకం, సుగంధ పుష్పాల అలంకరణ, విశేష పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. తదుపరి భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించి వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సూర్య భగవానుని దర్శనార్థం భక్త లు ఉమ్మడి అనంతపురం జిల్లానుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి వందలాదిగా తరలివచ్చారు. బూదగవిలో అతి పురాతన దేవాలయంగా పేరొందిన సూర్య దేవాలయంలో ఆదిత్యుని ఆదివారం రోజు సూర్యోదయ సమయములో దర్శించుకుని, స్వామివారికి తైలాభిషేకం నిర్వహించి విశేష పూజలు ఆచరిస్తే ఆయురారోగ్యాలు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ప్రతి ఆదివారం బూదగవి సూర్య దేవాలయానికి వందల సంఖ్యలో భక్తులు వచ్చి సూర్య భగవానుని దర్శించుకోవడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది. పక్కనే ఆలయంలో కొలువైన లింగ రూపంలో ఉన్న మహా శివునికి ఆలయ అర్చకులు ఉదయాన్నే రుద్రాభిషేకం, విశేష అర్చనలు, విశిష్ట పూజలు జరిపారు. పరమశివుని దర్శనార్థం వచ్చిన భక్తులకు అర్చకులు స్వామి ఆశీర్వచనం అందించి వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆదిత్యుని దర్శనార్థం ఆలయానికి వచ్చిన భక్తులకు సూర్య దేవాలయ సేవా సమితి వ్యవస్థాపకులు చిరంజీవి, ప్రతినిధులు మహేంద్ర గౌడ్, సుధాకర్ ఆలయ చరిత్రను, ఆలయ అభివృద్ధి పనులను వివరించారు.

## 23 న సాఫ్ట్‌బాల్ జూనియర్ జిల్లా జట్ల ఎంపికలు

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : సాఫ్ట్బాల్ సీనియర్, జూనియర్ బాల,బాలికల అనంతపురం జిల్లా ఎంపికలు ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు అనంత క్రీడామైదానం ఆర్డిటి నందు జరుగును. జూనియర్ సాఫ్ట్బాల్ ఎంపికలకు అర్హత ధ్రువీకరణ తేదీ 01-01-2007 పైన జన్మించిన వారు అర్హులు. సీనియర్, జూనియర్ ఎంపీలకు హాజరగువారు తప్పక పుట్టిన తేదీ ధ్రువీకరణ మరియు ఆధార్ కార్డుతో హాజరుకావలెను. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్బాల్ పోటీలు ఆగస్టు 10,11, 12 గుంటూరు జిల్లా, వినుకొండలో జరుగును. రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్బాల్ పోటీలు ఆగస్టు 17,18,19 శ్రీకాకుళంలో జరిగినని ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్బాల్ అసోసియేషన్ సీఈవో శ్రీ వెంకటేశు లు మరియు అనంతపురం జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర హర్షవర్ధన్ తెలియజేశారు.

## 108 జిల్లా మేనేజర్ బదిలీ

### సూర్య కథనాలతో స్పందన

### ఇప్పటికైనా గాడిలో పడేనా అంటూ ప్రశ్నార్థకం

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : 108 జిల్లా మేనేజర్ సంజీవరెడ్డి నీ బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల సూర్యలో 108 అధ్వాన్న పరిస్థితిపై వరుస కథనాలు ప్రచురించడంతో ఆదివారం ప్రత్యేక సమావేశం ద్వారా ప్రస్తుతం జిల్లా మేనేజర్ గా పనిచేస్తున్న అతనిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జోనల్ మేనేజర్, రాష్ట్ర హెచ్ఆర్ ప్రత్యేకంగా విచారణ జరిపి అనంతరం జిల్లాలో అత్యంత దారుణమైన పరిస్థితి నెలకొనడంతో అతనిపై చర్యలకు పాల్పడ్డారు. అధ్వాన్న పరిస్థితిలో జిల్లా మేనేజర్ ఉన్నారని ఉద్యోగులు సిబ్బంది ఆయనపై తీవ్ర ఆరోపణలు చేర్చిన నేపథ్యంలో బదిలీ వేటు వేశారు. దీంతోపాటుగా జిల్లాలో ఉండకుండా ఎక్కడి నుంచో వ్యవహారం నడుపుతున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి తోడు ఆయనకు తొత్తులుగా వ్యవహరిస్తున్న వారి పట్ల ఆయన పూర్తి అనుకువగా వ్యవహరిస్తున్నాడని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపించాయి. దీంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకున్నారు.

## సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే కాలవ

కనేకల్లు, మేజర్ న్యూస్ : కనేకల్ మండల కేంద్రం ఎస్ఎస్ ట్యాంక్ వద్దగల సాయిబాబా దేవాలయం నందు గురు పౌర్ణమి సందర్భంగా రాయదుర్గం శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పోలీస్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయమంతా ప్రత్యేకంగా అలంకరించి గత రెండు రోజులు ఉంటే ముస్తాబు చేశారు. గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబానీ వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వెంట ఆనందరాజులు, చంద్రశేఖర్ గుప్తా, మిల్లు నాగప్ప, గుడు గుండ్ల గంగాధర ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హిందూపురంలో రెచ్చిపోతున్న

# గంజాయి మాఫియా

▸▸ మొదటి పేజీ తరువాయి

అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు దళారులు కర్ణాటక నుంచి గంజాయిని పట ్టణానికి తెస్తున్నారు. ఆవారాగా తిరిగే వారిని, బిచ్చగాళ్లను మధ్యవర్తులుగా పెడుతున్నారు.తొలుత యువత కు గంజాయి మత్తును అలవాటు చేసి ఆపై కొన్ని పొట్లాలు విక్రయిస్తే కమిషన్ ఇస్తామని ఎర వేస్తున్నారు. గంజాయి కొనేందుకు నగదు లేక కమిషన్ కోసం గంజాయి విక్రయదారులుగా మారుతున్నారు కొందరు యువకులు.

### ఒక్కసారి తాగితే అంతే..

సరదా కోసమే.. స్నేహితుల ఒత్తిడి కోసమే ఒకసారి గంజాయి సేవిస్తే భర్తకు పూర్తిగా అలవాటు పడుతున్నారు. గతంలో గంజాయి మత్తులో వివిధ నేరాలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి.పట్టణ, గ్రామీణ శివారులో పోలీసులు పెట్రోలింగ్ సరిగ్గా చేయకపోవడంతో యువకులు గంజాయి మత్తులో రెచ్చిపోతున్నారు.

### రైల్లో తరలింపు

కర్ణాటక సరిహద్దు ఉండడంతో గంజాయి స్మగ్లర్లకు హిందూపురం అడ్డగా మారిపోయింది.కర్ణాటక నుండి హిందూపురం కి రైలు లో తీసుకొనివస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా బెంగళూరు నుండి హిందూపురం కి వచ్చే ప్యాసింజర్ రైల్లో గంజాయి సరఫరా చేస్తున్నారని సమాచారం.ఇటీవలే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు లో ఒరిస్సా రాష్ట్రం నుంచి హిందూపురం కి తీసుకొస్తూ పోలీసులకు పట్టుపడారు. అదేవిధంగా కొన్ని నెలల క్రితం విశాఖ ఏజెన్సీ నుండి హిందూపురం తరలిస్తూ కర్నూలు లో  పట్టణానికి చెందిన ఓ యువకుడు పట్టుబడ్డాడు. అయితే ఇటీవల కాలంలో గంజాయి సరఫరా చేస్తున్న కొంతమంది కేటుగాళ్లు పోలీసులతో కుమ్మక్కై పట్టణంలో విచ్చలవిడిగా ఏ వీధిలో చూసినా గజాయి గుబ్బు మంటోంది. మాదకద్రవ్యాలను అరికట్టాల్సిన ఖాకీలు గంజాయి స్మగ్లర్లతో స్నేహానుబంధాలు చేస్తున్నట్లు పట్టణంలో పలువురు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఇలాంటి వారి నుండి మొత్తం పోలీస్ శాఖకే అవమానం.

## బెలుగుప్ప మండలంలో ఘనంగా గురు పౌర్ణమి మహోత్సవం





**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బెలుగుప్ప, నక్కలపల్లి గ్రామాలలో షిరిడి సాయి బాబా దేవాలయాల్లో గురు పౌర్ణమి మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు గురుబ్రహ్మ గురుర్విష్ణు: గురుదేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమః "గు" శబ్దం అంధకారాన్ని తెలుపుతుంది, "రు" శబ్దం అంధకారాన్ని తొలగిస్తుంది, అజ్ఞానమనే అనే అంధకారాన్ని తొలగించి మనకు జ్ఞానాన్ని ప్రసాదించేది గురువు, అజ్ఞానాన్ని పారుదొలి జ్ఞానాన్ని అందించే గురువును ఎప్పుడు గౌరవించాలి. ఇంతటి ఆది గురువుని పూజించడం మన కర్తవ్యం ఈ కర్తవ్యాన్ని తరువాత తరాలవారికి అందించడం మన ధర్మం, గురు పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని బెలుగుప్ప, నక్కలపల్లి గ్రామాలలో శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో విశేష పూజా కార్యక్రమం నిర్వహించారు. షిరిడి సాయిబాబాకు కాకడ హారతి శ్రీ మహాగణపతి పూజ, షిరిడి సాయి కి పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, షిరిడి సాయిబాబా వారికి భక్తులచే అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటల నుండి 2గంటల వరకు కడప జిల్లా చిన్న సింగంపల్లి గ్రామం రామచంద్ర గురువు ఆధ్వర్యంలో జైశ్రీరామ్ మహిళా సభ్యులచే కోలాట కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నా హారతి, అనంతరం సాయంత్రం బెలుగుప్ప, నక్కలపల్లి గ్రామాలలో శ్రీ షిరిడి సాయిబాబా ఉత్సవ విగ్రహానికి సుందరంగా పూలమాలతో అలంకరించి, పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవ ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల చుట్టపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు వచ్చిన భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించెదరు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన భజన బృందాలకు ఉత్తమ బహుమతులు, నగదు బహుమతులు ఇవ్వబడనని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



## ప్రపంచానికి నాగరికతను చాటి చెప్పిన మహనీయులు... వేద వ్యాస గురుదేవులు

### బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో వ్యాస పౌర్ణమి (గురు పౌర్ణమి) వేడుకలు

**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** మహాభారత, భాగవతాలను రచించి వేదాల ద్వారా ప్రపంచానికి నాగరికతను నేర్పిన మహనీయులు గురువర్యులు వేద వ్యాసులని బెస్త సేవా సంఘం గౌరవ అధ్యక్షులు రామన్న, నియోజకవర్గ అధ్యక్షులు బెస్త తిప్పయ్య, కార్యదర్శి ఎర్రి స్వామి తెలిపారు. ఆదివారం పట్టణంలో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో వ్యాస పౌర్ణమి ( గురు పౌర్ణమి ) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్త సేవా సంఘం ప్రతినిధులు వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలు వేసి  విశేష పూజలు జరిపారు. గురువర్యులు వేదవ్యాసులు ప్రపంచానికి అందించిన కీర్తి ప్రతిష్టలను కొనియాడారు. వేల సంవత్సరాల క్రితం బట్టలు కొట్టుకోవడం చేతగాని అనాగరిక ప్రపంచంలో అద్భుతమైన విజ్ఞానాన్ని సమర్జించిన గొప్ప మహనీయులుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాస పౌర్ణమి (గురుపౌర్ణమి) పర్వదినాన్ని అధికారికంగా జరపకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్ర తెలియని ఆధునిక సమాజం వ్యాస పౌర్ణమిని కొద్దిమందికి అంకితం చేసే విధంగా జరుపుకోవడం బాధాకరమని, క్షమించరాని  నేరంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలు వ్యాస మహర్షిని అవమానించడం, తక్కువ చేసి చూపడమేనని, వేద వ్యాసుడు ఒక బలహీన వర్గానికి చెందిన గంగపుత్రుడు  కావడమే మహనీయుని పట్ల నిర్లక్ష్యానికి కారణమా అని ప్రశ్నించారు. వేద వ్యాసుని అవమానించడం అంటే మనల్ని మనమే అవమానించుకోవడమేనని గుర్తు చేశారు. బెస్త జాతిలో నేటికీ నిరక్షరాశులుగా ఉన్న వారందరిని అక్షరాస్యులుగా, సామాజిక, రాజకీయ, ఆర్థిక చైతన్యవంతులని చేసినప్పుడే వ్యాస మహర్షికి నిజమైన నివాళి, గౌరవం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవా సంఘం ప్రతినిధులు మల్లికార్జున, సురేష్, రామాంజనేయులు, మణికంత, ఎర్రి బాబు, పకీరప్ప, సుజాత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా షిరిడి సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి..

### జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వేలాది భక్తులు..



**12 గంటల పాటు కొనసాగిన అన్నదానం...**

**భక్తులకు సకలగా ఏర్పాట్లు చేయించిన ఆలయ కమిటీ చైర్ పర్సన్ రజిత..**

**దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలన..**

కూడేరు, మేజర్ న్యూస్

కూడేరు మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా దేవాలయంఎంతో ప్రసిద్ధి చెందింది. గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్ పర్సన్ రజిత జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సకల ఏర్పాట్లు చేయించారు. దగ్గరుండి మరి పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు కాకడ హారతి, 6 గంటలకు సామూహిక అభిషేకం, వెండి సింహాసనం అలంకరణ, మహా మంగళహారతి, 9 గంటలకు మహా గణపతి నవగ్రహ మృత్యుంజయ సాయినాథ దత్తాత్రేయ విష్ణు సహస్రనామ హెూమాలు, 12 గంటలకు మహా మంగళ హారతి, సాయంత్రం 6 గంటలకు సాయం సంధ్య హారతి, ఏడు గంటలకు ప్రాకారోత్సవం, మహా మంగళహారతి, 7:30 గంటలకు ప్రసాద వినియోగం, రాత్రి 10 గంటలకు శేజ హారతితో ప్రత్యేక పూజలు ముగిశాయి. ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు  అన్నదానం కొనసాగింది. ఆలయ ధర్మకర్త దివంగత తుపాకుల శివరామిరెడ్డి భక్తులకు ఏ విధంగా  దగ్గరుండి ఏర్పాట్లు చేయించేవారో ఆయన కుమార్తె రజిత కూడా భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా సకల ఏర్పాట్లు చేయించారని, భక్తులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్ పర్సన్ రజిత మాట్లాడుతూ..దినదిన అభివృద్ధి చెందుతున్న కూడేరు షిరిడి సాయిబాబా దేవాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోందన్నారు.తన తండ్రి శివరామిరెడ్డి అభీష్టం మేరకు తనకు షిరిడి సాయినాధుని సేవ చేసుకునే అదృష్టం దక్కిందన్నారు. భవిష్యత్తు లో ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని.. తనకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న కమిటీ సభ్యులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వేడుకగా గురు పౌర్ణమి వేడుకలు

### షిరిడి సాయి ఆలయంలో పోటెత్తిన భక్తులు



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం వేకువ జామునే షిరిడి సాయినాధుని మూల మూర్తి  చెంత ఆలయ అర్చకులు  విశిష్ట పూజలు ఆచరించారు. అంతకమునపు సాయినాధుని మూల విగ్రహాన్ని  సుగంధ పుష్పాలతో అందంగా అలంకరించారు . బాబా దర్శనార్థం విశేషంగా తరలివచ్చిన భక్తజనం శిరిడీ సాయినాధునికి, గురు దత్తాత్రేయ స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. పవిత్ర గురు పౌర్ణమిని పురస్కరించుకొని శిరిడీ సాయినాధుని దర్శించుకునేందుకు ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. గంటల తరబడి భక్తులు క్యూ లైన్ లలో నిరీక్షించి శిరిడి సాయినాధుని దర్శించుకుని, బాబా ఆశీర్వచనం అందుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా  ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. షిరిడి సాయిబాబా ను దర్శించుకున్న సమస్త భక్తజనానికి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నదాన సంతర్పణ కావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా  గురుపౌర్ణమి మహోత్సవం



**పామిడి. మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పామిడి పెన్నానదిలో వెలసిన శ్రీ షిర్డీసాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి ఉత్సవం దేవాలయల వ్యవస్థాపక అధ్యక్షుడు పీఠాధిపతి సనారి వీరయ్య స్వామి ఆధ్వర్యంలో ఆదివారం దిగ్విజయంగా నిర్వహించారు.వేలాది మంది భక్తాదులు సాయి బాబాను దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. తదుపరి అన్నదాన కార్యక్రమంలో దాదాపుగా 4వేల మంది పైగా భక్తాదులు పాల్గొని బోజనాలన ఆరగించారు ఆవరణమంతటా బాబా నామస్మరణంతో మారుమ్రోగింది.ఈసందర్భంగా పీఠాధిపతి వీరయ్యస్వామి మాట్లాడుతూ దేవుని కన్నా మొదటి స్థానం సద్గురువునిదని, ప్రతి ప్రాణికి మార్గదర్శకం గురువే అన్నారు. తదుపరి భజన కార్యక్రమం నిర్వహించారు.

## సాయిబాబాను దర్శించుకున్న మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి  రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** అనంతపురం మూడవ రోడ్ లోని సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గంగన లక్ష్మీరెడ్డి స్వామివారి చిత్రపటాన్ని ఎమ్మెస్ రాజుకు బహుకరించి, శాలువా  తప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు



వెంకటప్ప, ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం మూడవ రోడ్డు షిరిడి సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం కాకడ హారతి సాయిబాబాకు  ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**అనంతపురం విద్య మేజర్ న్యూస్**




# ఇదేమి విడ్డూరం?

- రక్త పరీక్షల్లో గోల్ మాల్
- ఆసుపత్రిలో పరీక్ష చేయిస్తే ఎల్ ఎఫ్ టి 22
- ప్రైవేటు సెంటర్‌లో పరీక్ష చేయిస్తే 2.1
- ఆశ్చర్యపోతున్న రోగులు

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యం గోవిందా.. గోవిందా..!!

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :



> సాధారణ జ్వరంతో వస్తే ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స కోసం రక్తపరీక్ష చేస్తే ఇక అంతే సంగతులు. నగరానికి చెందిన సురేంద్ర అనే వ్యక్తి తీవ్రమైన జ్వరం రావడంతో శనివారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చాడు.

దీంతో అతనిని పరీక్షించిన వైద్యులు రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. దీంతో అతను నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డయాగ్నస్ చేయించి వాటి వివరాల కోసం వెళ్ళాడు. దీంతో ఎల్ ఎఫ్ టి ఏకంగా 22 ఉందని లెక్క చూపించారు. దీంతో వారు ఇచ్చిన వివరాలతో ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించారు. వైద్యులు ఒకసారిగా కంగుతిని ఇక్కడ చేస్తే ఇలాగే ఉంటుంది అనుకున్నారో ఏమో ఆదివారం నగరంలోని ప్రైవేట్ దయాగ్నస్టిక్స్ సెంటర్ కు వెళ్లి పరీక్షలు చేయించుకోమని సూచించాడు. దీంతో తనకు ఆర్థిక భారం అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో డబ్బులు వెచ్చించి ప్రైవేటు దయాగ్నస్టిక్ సెంటర్ కు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. ఆదివారం అక్కడ అందించిన పరీక్ష ఫలితం చూసి ఏకంగా వైద్యులే ఆశ్చర్యపోయారు. అందులో ఫలితం 2.1 తేలింది. దీంతో ఆ వచ్చిన ఫలితాన్ని వైద్యులకు చూపించి ఆదివారం నుంచి అతనికి వైద్య సేవలు అందిస్తున్నారు.

### పరీక్షలు చేయిస్తే ఖంగు తినాల్సిందే

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయిస్తే ఇక అంతే సంగతులు అన్న విధంగా పరిస్థితి మారింది. వైద్యులలో నిర్లక్ష్యం సిబ్బంది పూర్తిగా అలసత్వం వహిస్తున్న ఇక్కడి ఉన్నతాధికారి కనీస చర్యలు తీసుకోకపోవడంతో దరిద్రమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పరీక్షలు చేయించి వైద్య చికిత్సలు చేస్తే ఏకంగా ఎలాంటి వైద్యం లేకుండా ఇక అతనిపై ఆశలు వదులుకోవాల్సిందే అంటూ తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. సాధారణంగా రక్త పరీక్షలలో తీవ్రమైన ఖచ్చితత్వంతో కూడిన వివరాలు అందించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఎలాంటి జంకు బంకు లేకుండా పేద ప్రజల ప్రాణాలను పణంగా పెట్టుకుని ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సాధారణంగా వ్యక్తికి వైద్య సేవలు అందించే క్రమంలో చేసే పరీక్షల్లో పూర్తిస్థాయి ఖచ్చితత్వంతో వాటి ఆధారంగా వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అతనికి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందించిన ఫలితాల ప్రకారం వైద్య సేవలతో ఏకంగా అతని లివరే పూర్తిగా పాడైపోయింది. కానీ బయట చేసిన పరీక్షలతో కొద్దిపాటి వైద్య సేవలను అతనికి అందిస్తే నయమై సాధారణ జీవితం గడుపుతాడు. ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితికి దిగజారిన



పరిస్థితి ఉన్న పట్టించుకున్న వారు లేరంటూ తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఏకంగా పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ తమ ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారు అంటూ తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అధిక సంఖ్యలో డయేరియా జ్వరాలు ఇతర రోగాల బారిన పడి వందల సంఖ్యలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రోగులు వస్తున్నారు. ఇక వీరు అందించే ఫలితాల నేపథ్యంలో వారు వైద్యం తీసుకుంటే ఇక గోవిందా గోవిందా గా వారి పరిస్థితి మారిపోతుంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేసే పరీక్షలకు అందించే వైద్యానికి ఎలాంటి కచ్చితంగా కానీ ఎలాంటి నియమ నిబద్ధత గాని లేకుండా కేవలం ఏదో చేసామా అయ్యిందా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఇలాంటి వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సామాన్య రోగులు కోరుతున్నారు.

---

# ముడుపులు ఇచ్చుకో.. అనుమతులు పుచ్చుకో...

**అనంతపురం జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ధన దాహానికి విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే స్కూల్ బస్సు లను ఆర్టీవో అధికారులు పరిశీలించి, 32 నిబంధనలు పాటిస్తున్నారా లేదా? అని ఆరాదీసి.. అన్ని పర్ఫెక్ట్ గా ఉంటేనే వాటికి ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఫిట్నెస్ లేని బస్సులను రోడ్లపై తిరిగేందుకు అనుమతించారు. అలా తిరిగితే ఆయా విద్యాసంస్థల బస్సులను సీజ్ చేసే అధికారం ఆర్టీవో అధికారులకు ఉంటుంది. మరి ఆర్టీవో అధికారులు విద్యార్థుల భద్రత విషయంలో ఆ విధమైన చర్యలు తీసుకున్నారా అంటే లేదనే సమాధానమే వినిపిస్తోంది. కాలం చెల్లిన బస్సులకూ క్లీన్ చిట్ ఇచ్చారన్న ఆరోపణలు ఆర్టీవో అధికారులు ఎదుర్కొంటున్నారు.**

## స్కూల్ బస్ ఫిట్నెస్ ప్రశ్నార్థకం...

- కాలం చెల్లిన బస్సులకూ క్లీన్ చిట్...?
- 32 నిబంధనలు పాటించక పోయినా పైపై రంగులు వేసి రోడ్లపై తిప్పుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలు...
- ఆర్టీవో అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం..
- ప్రమాదాలు జరిగితే ఎవరిదీ బాధ్యత...
- ఫిట్నెస్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చేరా...?

అనంతపురం విద్య మేజర్ న్యూస్




> ఆర్టీవో అధికారులూ.. టైర్ల కండిషన్, పిల్లలు ఎక్కే మెట్లు, విండోస్ గ్రిల్స్, సీట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ కిట్, వైపర్స్, ఇండికేటర్స్, హెడ్ లైట్స్, గ్లాస్ ఇలా ఇవన్నీ సరిగ్గా ఉన్నాయా లేదా పరిశీలించారా..? కేవలం రంగులు కొత్తగా వేశారని అనుమతి ఇచ్చారా..?

విద్యాసంస్థల ప్రలోభాలకు తలోగ్గి పైపై రంగులు వేసి రోడ్లపై ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులు తిరిగేందుకు అనుమతి ఇచ్చారని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. ఆర్టీవో అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే ఎవరిదీ బాధ్యత అని వారు నిలదీస్తున్నారు.

### ఫిట్నెస్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చేరా..

ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఉదాసీనతకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు మూల్యం చెల్లించుకునే దుస్థితి రాకముందే మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జరగరాని అనర్థం జరిగిన తర్వాత చర్యలకు ఉపక్రమించడం కంటే ముందుగానే అనర్థాలు జరగకుండా యాక్షన్ తీసుకోవడం ఉత్తమం. స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా ఆర్టీవో అధికారులను ఆదేశిస్తే తల్లిదండ్రుల అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు ప్రమాదాలను నివారించిన వారు అవుతారని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. జిల్లా సర్వోన్నత అధికారి అయిన కలెక్టర్ వినోద్ కుమార్ మరి స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై ఆర్టీవో అధికారులు స్పెషల్ డ్రై నిర్వహించేలా ఆదేశాలు ఇస్తారా..?

### స్కూల్ బస్సుల తనిఖీలలో ఆర్టీవో అధికారుల నిర్లక్ష్యం.. ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి కులల్లాయి స్వామి..


కుళ్లాయి స్వామి

స్కూల్ బస్సుల తనిఖీల విషయంలో ఆర్టీవో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ముడుపులు ఇచ్చుకో అనుమతులు పుచ్చుకో అన్న చందంగా వ్యవహరించిన కారణంగా ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు రోడ్లపై తిరుగుతున్నాయి. ఆర్టీవో అధికారులు కండిషన్ లేని బస్సులకు అనుమతులు ఇస్తున్నారని ప్రమాదాలు జరిగితే ఆర్టీవో అధికారులే బాధ్యత వహించాలి. వారానికి ఒకసారి అయినా ఆర్టీవో శాఖ అధికారులు స్కూల్ బస్సులను తనిఖీ చేయడంతో పాటు ఎంతమంది సామర్థ్యంతో నడుపుతున్నారని పరిశీలించాలి. స్పెషల్ ఫిట్నెస్ డ్రైవ్ నిర్వహించకపోతే ఆర్టీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని కుళాయి స్వామి హెచ్చరించారు.

### విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలు.. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్..


పరమేష్

ఫిట్నెస్ లేని బస్సులను రోడ్లపై తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలతో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, చెలగాటమాడు తున్నాయి. బస్సులు కండిషన్ లో లేకపోయినా వేలాది రూపాయలు ట్రాన్స్పోర్ట్ ఫీజులు వసూలు వసులు చేస్తున్నాయి. తక్కువ జీతానికి వస్తారని 60 సంవత్సరాలకు పైబడిన వారిని డ్రైవర్లుగా నియమిస్తున్నారు. ఆర్టీవో అధికారులు తక్షణమే స్పందించి ఫిట్నెస్ పై పరిశీలన చేయాలని పరమేష్ డిమాండ్ చేశారు.

### ఆర్టీవో అధికారులు మొద్దు నిద్ర వీడాలి.. బిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మూర్తి


మూర్తి

ఆర్టీవో అధికారులు మొద్దు నిద్ర వీడి కండిషన్లో లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి. ప్రలోభాలకు లోబడి కండిషన్లో లేని బస్సులకు అనుమతి ఇస్తే ఆర్టీవో కార్యాలయాన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ముట్టడించేందుకు ఏమాత్రం వెనకడం. తక్షణమే స్కూల్ బస్ ఫిట్నెస్ పై ఆర్ టి ఓ అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని మూర్తి డిమాండ్ చేశారు.

### స్కూల్ బస్ ఫిట్నెస్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి.. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక విద్యార్థి జేపీసీ రాష్ట్ర అధ్యక్షులు గోగుల మూర్తి..


గోగుల మూర్తి

ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల బస్సుల ఫిట్నెస్ పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం రంగులు కొట్టి బస్సులను రోడ్లపై నడుపుతున్నారు. స్కూల్ బస్సు ఫిట్నెస్ పై ఆర్టీవో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించకపోతే విద్యార్థి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రత చేస్తామని గోగుల మూర్తి హెచ్చరించారు.



## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు..

మడకశిర, మేజర్ న్యూస్ : పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ షిరిడి సాయినాథుని ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా ఈ రోజు ఆదివారం సాయి బాబా కు ప్రత్యేక అలంకరణతో ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల కలసి సాయి నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు..

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



పామిడి. మేజర్ న్యూస్ : పట్టణంలోని చిన్నప్ప శెట్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989 పదవ తరగతి విద్య అభ్యసించిన విద్యార్థుల కలయిక ఆదివారం ఎంతో ఆహ్లాదకరంగా జరిగింది పదవ తరగతి చదివిన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు ఆత్మీయ సమ్మేళనం పలకరింపులు నడుమ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు ఈ కార్యక్రమంలో 100 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరడంతో సందడి నెలకొంది.

## శింగనమలలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



శింగనమల,మేజర్ న్యూస్ : శింగనమల మండల కేంద్రంలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి షిరిడి సాయి మందిరంలో బాబాకు ప్రత్యేక హారతులు, ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. శింగనమల మండల వ్యాప్తంగా ఉన్న షిరిడి సాయి భక్తాదులు పూజలలో పాల్గొనడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలియజేశారు.గురు పౌర్ణమి వేడుకలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మైనాస్వామికి ప్రైమ్ న్యూస్ పురస్కారం..

గోరంట్ల, మేజర్ న్యూస్ : ప్రముఖ రచయిత మరియు చరిత్రకారుడు మైనాస్వామి ప్రైమ్ న్యూస్ టి.వి. ఛానెల్ ప్రతిభ పురస్కారం అందుకొన్నారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన పలువురికి ప్రైమ్ న్యూస్ యాజమాన్యం శనివారం రాత్రి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పురస్కారాలను అందజేసింది. అందులో భాగంగా విజయనగర సామ్రాజ్య చరిత్ర, సంస్కృతి, శాసనాలు, కోటలు, ఆలయాల నిర్మాణాలు తదితర అంశాలపై విస్తృతంగా పరిశోధన కొనసాగిస్తున్న మైనాస్వామిని అతిథులు ఘనంగా సత్కరించారు. ప్రశంస పత్రంలో పాటు ఒక జ్ఞాపికను సినీ నటుడు పృథ్వీరాజ్, ఎన్.ఆర్.ఐ. కొండా నరేంద్ర చరిత్ర కారునికి బహూకరించారు. ముఖ్య అతిదిగా పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ మైనాస్వామి చేస్తున్న పరిశోధనను ప్రశంసించారు. 'విజయనగర సామ్రాజ్య చరిత్ర – ఆలయాలు – లేపాక్షి' పై మైనాస్వామి వివిధ భాషల్లో రాసిన పుస్తకాలు విశేష ఆదరణకు గురవుతున్నాయి.




## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**– భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు**

**– శ్రీ శివ సాయిబాబా ప్రత్యేక పూజల్లో జెసి ప్రభాకర్ రెడ్డి**



తాడిపత్రి మేజర్ న్యూస్ : తాడిపత్రి పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గురు పౌర్ణమి పురస్కరించుకొని భక్తులు తెల్లవారుజామునుంచే బాబా దర్శించుకోవడానికి బారులు తీరారు. భక్తులతో ఆలయాలు సాయి నామస్మరణతో కిటకిటలాడాయి. శివాలయం దగ్గర ఉన్న సాయిబాబా దేవాలయంలో బాబా ప్రత్యేక పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.బాబా దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

**జేసీ ఆధ్వర్యంలో సాయినాథునికి ప్రత్యేక పూజలు**

పట్టణంలోని సంజీవ నగర్ 5వ రోడ్ లో ఉన్న శ్రీ శివ సాయి బాబా దేవాలయంలో జెసి ఫ్యామిలీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చనతో మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి దంపతులు కలిసి సాయి నాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడి ప్రాంగణ పరిసరాలు అలంకరణ భక్తులను ఆకర్షించాయి.బాబా దర్శనానికి వచ్చిన భక్తులకు జెసి ఫ్యామిలీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## స్నేహపూర్వక క్రికెట్ పోటీలు



కదిరి టౌన్, మేజర్ న్యూస్: ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కదిరి సబ్ సెంటర్ నందు శిక్షణ పొందు తున్న క్రీడాకారుల కు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన అండర్ 16 జట్టు 25 ఓవర్లలో 168 పరుగులు చేయగా, ఆ తరువాత బ్యాటింగ్ చేసిన అండర్ 14 జట్టు 25వ ఆఖరు బంతిలో విజయం సాధించారు. మ్యాచ్ తరువాత గురుపౌర్ణమి సందర్భంగా క్రీడాకా రులు, వారి తల్లితం డ్రులు కోచ్ నజీర్ ని సన్మానించి శుభా కాంక్షలు తెలియచే సారు. ఈ కార్యక్రమం లో సీనియర్ క్రీడాకా రులు ముబారక్, నరసింహ మూర్తి, నాగరాజు, మనోహర్, రేవంత్ పాల్గొన్నారు.




## ముగిసిన పాండురంగ, రుక్మిణీదేవిల బ్రహ్మోత్సవాలు

పామిడి. మేజర్ న్యూస్ : పట్టణంలోని శ్రీరంగశుభేఫిర్కా భగవాన్ దాస్ విఠోబ స్వామి రుక్మిణీదేవిల బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి. రుక్మిణి సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల సందర్బంగా ఆదివారం ఉట్ల తేరు కన్నుల పండగగా నిర్వహిం చారు. తేరును ముఖ్య అతిథి ఎం పి డి ఓ శ్రీనివాసరావు, ఈఓ ఏ క్రిష్టయ్య సంఘం అధ్యక్షులు టి టి నాగభూషణ రావు కమిటీ సభ్యులు లాగి ప్రారంభించారు. చక్క భజనలు, దిండి భజనలు, సన్నాయి వాయుధ్యాల మధ్య తేరు కొనసాగింది. తొలుత థాయింది మృత్తిక పాత్రను గర్భాలయంలో ప్రధాన పురోహితులు టివియస్ శర్మచే పూజలు చేయించి పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఉట్ల మానుకు పాత్రను బిగించి దైవ కర్రలతో పగుల గొట్టారు. అనం తరం గ్రామోత్సవం చేశారు. భక్తులు కొబ్బరికాయలు, పుష్ప తాంబూలాలు సమర్పించి మొక్కలు తీర్చు కున్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వాల నమోదు



పరిగి, మేజర్ న్యూస్ : ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు టి.సి వరుణ్ ఆదేశాల మేరకు నాలుగవ విడత జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పరిగి మండలం కన్వీనర్ సురేష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ప్రతి భూతులోను సభ్యత్వం నిర్వహించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షులు రవితేజ, ప్రధాన కార్యదర్శి అశ్వర్థ నారాయణ, కార్యదర్శి రామాంజి మాట్లాడుతూ క్రియాశీలక వాలంటీర్లు ప్రతి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రంగప్ప, మధు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అక్కదేవతల పరుష మహోత్సవం

**– పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, , మాజీ మంత్రి**

పుట్టపర్తి రూరల్ మేజర్ న్యూస్ : పుట్టపర్తి మండల పరిధిలోని సుబ్బరాయునిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన అక్కదేవతల వరస మహోత్సవం ఆదివారం గ్రామస్తులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని, అక్కదేవతల చుట్టూ ఎడ్ల బండిపై ప్రదక్షణలు చేసి అనంతరం గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యేతో అభిమానులు, నాయకులు, సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడ్డారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించారు అక్కదేవతల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఏడుగురు చిన్నారులతో అమ్మవారికి కుంకు





మార్చన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమం లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .వివిధ ప్రాంతాల్లో నుండి ఎంతోమంది భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి హాజరయ్యారు. మండల వాసు లేక కాక ఇతర మండలాలైన గోరంట్ల, కొత్తచెరువు, పెనుగొండ నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎడ్లబండ్ల పోటీలలో రైతులు, యువకులు, ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏడుగురు అక్కదేవతలకు ఎంతో భక్తిశ్రద్ధలతో గుడి నిర్వాహకులు మూడు రోజుల నుండి ఉత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, బొమ్మయ్య, మహానంద, మనీ, నరసింహప్ప, తెలుగుదేశం నాయకులు ,శ్రీరాం నాయక్, కొత్తచెరువు బిజెపి నాయకుడు నాయుడు. శ్రీరామిరెడ్డి, బెస్త చలపతి, పుల్లప్ప, ఆకుల కుల్లాయప్ప, వెంకటరాముడు, భక్తులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోసమే పౌర్ణమి గరుడసేవల నిర్వహణ

**- ఆలయ ఈవో వెంకటేశులు**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** సమాజ శ్రేయస్సు కొరకే ఈ పౌర్ణమి గరుడ సేవలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కోనేరా చార్యులు మకరంద బాబు భాను ప్రకాష్ చక్రధర్లు తొలుత స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత, పట్టు పంచలతో, వివిధ ఆభరణాలతో అలంకరించి స్వామివారిని పల్లకిలో ఆసీనులు చేశారు. తిరుమల, తిరుపతి దేవస్థానములో జరిగే విధంగా ప్రతినెల పౌర్ణమి రోజున అక్కడ జరిగే పద్ధతులలోనే సాంప్రదాయ పద్ధతిలో మన ధర్మవరంలో నిర్వహించుట మాకెంతో సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. దాతల సహాయ సహకారాలతోనే ఈ గరుడసేవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి దాతగా ధర్మవరం శాసనసభ్యులు, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ వ్యవహరించడం జరిగిందని, వారు కొన్ని అనుకొని కారణాల వలన రాలేకపోయారని తెలుపుతూ, వారి పేరిటన అర్చనలు, ప్రత్యేక పూజలను బిజెపి నాయకులు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తాదులు, ఆలయ సిబ్బంది, బిజెపి నాయకులు కలిసి రతాన్ని లాగి వేడుకలను ప్రారంభించారు. తదుపరి స్వామి వారు పట్టణంలోని వివిధ పురవీధుల గుండా ఊరేగింపు గా నిర్వహించారు. భక్తాదులు కూడా పురవీధులలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జింక చంద్రశేఖర్, షాకే ఓబులేసు, ఎర్రజోడు లోకేష్, హరీష్, ఆలయ మేనేజర్ రామశాస్త్రి, సిబ్బంది మల్లికార్జున, హరి, మాజీ కమిటీ సభ్యులు లతోపాటు భక్తాదులు పాల్గొన్నారు.

# రమణ మహర్షి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

**-అన్నదాన కార్యక్రమం ఏర్పాటు**



**ధర్మవరం మేజర్ న్యూస్** పట్టణంలోని మార్కెట్ యార్డు నందు గల రమణ మహర్షి ఆశ్రమం నందు గురు పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆశ్రమ వ్యవస్థాపక చైర్మన్ చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో వేడుకలు రంగ రంగ వైభవంగా నిర్వహించారు. రమణుని చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. అద విధంగా భక్తులు ప్రత్యేక పూజలు అనంతరం వి విధ సంకీర్తనలు, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గోమాతను పూజించి గోవుల పట్ల తమ భక్తీ ప్రవర్తిని చాటుకున్నారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని ప్రతినెల పున్నమి రోజు జరిగే కార్యక్రమంలో భాగంగా ఈసారి గురు పౌర్ణమి కూడా రావడంతో ఆలయంలో ప్రత్యేకంగా పూజలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు వందలాదిమంది భక్తులు హాజరై రమణుని పట్ల తమకున్న భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి నారాయణ సేవ (అన్నదానం) నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో వందలాదిమంది పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ధర్మవరం వాసి మృతి



**ధర్మవరం మేజర్ న్యూస్:** ఒంగోలు జిల్లా మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెం వద్ద ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలోధర్మవరం పట్టణానికి చెందిన గజ్జలశివయ్య (43) మృతిచెందాడు. శివయ్య మోడీకేర్ సంస్థలో గ్లోబర్ రెడ్ డైమండ్ డైరెక్టర్గా పనిచేస్తున్నారు. ఉద్యోగ నిమిత్తం ఒంగోలుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఒంగోలు నుంచి ప్రైవేటు ఓల్వో బస్సులో ఆదివారం రాత్రిప్రయాణం చేశారు. ఈ బస్సు మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెంకు రాత్రి 3గంటలకు చేరుకుంది. అక్కడ ఎనుము అడ్డురావడంతో వాటి తప్పించబోయి బస్సు బోల్తాపడినట్టు తోటి ప్రయాణీకులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గజ్జలశివయ్య అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. గజ్జల శివయ్య ప్రస్తుతం అనంతపురంలో నివాసముంటున్నాడు. ఈయనకు భార్యసువర్ణ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది

# మైనర్ అమ్మాయిని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**- వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ప్రియాంక నగర కు చెందిన ఓ మైనర్ అమ్మాయితో, ఇదే పట్టణానికి చెందిన గీతా నగర్ లోని శెట్టి గణేష్ అనే వ్యక్తి మాయ మాటలు చెప్పి, నమ్మించి మోసం చేసిన వ్యక్తిని వన్టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం అరెస్టు చేసి కోర్టుకు పంపడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ, డి.ఎస్.పి ఆదేశాల మేరకు ఈ కేసును చేదించినట్లు తెలిపారు. కేసు వివరాలు తెలుపుతూ శెట్టి గణేష్ అనే వ్యక్తి శ్రీ సాయిరాం ఐటిఐ కాలేజీలో రెండవ సంవత్సరం ఎలక్ట్రిషన్ గా చదువుతున్నాడని, ఒక సంవత్సరం కిందట ప్రియాంక నగర్ లోని ఓ మైనర్ అమ్మాయితో ఇంటగ్రామ్ ద్వారా పరిచయమై అప్పటినుండి అమ్మాయిని వెంటపడుతూ ఇబ్బంది పెట్టే వాడని తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉదయం అమ్మాయిని వాళ్ళ నాన్న స్కూలు దగ్గరకు వదిలి వెళ్ళగానే, ముద్దాయి అమ్మాయిని బలవంతంగా ప్యాసింజర్ ఆటోలో ఎక్కించుకొని ఆర్టీసీ బస్సులో అనంతపురంకి వెళ్లి, అక్కడినుండి బెంగళూరుకు తీసుకొని వెళ్ళాడు అని తెలిపారు. తిరిగి 19వ తేదీన పావుగడకు చేరుకొని, ఓ లాడ్జిలో ఉండి వెళ్ళిపోయాడు. తదుపరి ముద్దాయి అమ్మాయిని ధర్మవరం బస్సు ఎక్కించాడని తెలిపారు. ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం ఎర్రగుంట ఫోర్ రోడ్ జంక్షన్ వద్ద నాతోపాటు సిబ్బంది పెద్దమనుషుల సమక్షంలో అరెస్టు చేయడం జరిగిందని వారు తెలిపారు.

# మల్లాలమ్మ దేవతకు బోనాలను సమర్పించిన మహిళలు



**గోరంట్ల, మేజర్ న్యూస్ :** ఆషాడమాసంలో గోరంట్ల పట్టణంలోని చిత్రావతి నది ఒడ్డున వెలసిన మల్లాలమ్మ దేవత ఆషాడ మాస అమ్మవారికి బోనాల ఉత్సవ మహెూత్సవం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను పట్టణంలో ఊరేగింపు ద్వారా అమ్మవారికి సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు గుజిరి శ్రీనివాసులు, ఉదయ్ కుమార్, బొట్టు శ్రీనివాసులు, శంకరప్ప, మధుసూదన్, ఎం శ్రీనివాసులు మరియు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నాపై ఆరోపణలు వాస్తవంకాదు

**- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలోని బత్తలపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 401 లో 19.84 ఎకరాల నిడిమామిడి ఆంజనేయ స్వామి మఠం కు చెందిన భూమి నాకు సంబంధించినది అని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అయితే నాకు ఆ భూమికి ఎటువంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. అనంతరం ఒక ప్రకటనలో వివరణ తెలుపుతూ ప్రస్తుతం ఆ భూముల్లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేయడం జరిగిందని, ఒకవేళ ఆ భూమి మఠానికి చెందినది అయితే, ప్రభుత్వం ఆ భూములను పేదలకు గుర్తించి వారికి ఇంటి పట్టాలు ఇప్పించాలని వారు ఎన్డీఏ ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వలేని పక్షంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజున పేద ప్రజలకు ఇంటి పట్టాలు అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. గతంలో కూడా ఇలాగే నాకు సంబంధంలేని భూములను నావిగా చూపిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అని తెలిపారు. అప్పుడు కూడా అనేకసార్లు వివరణ ఇవ్వడం కూడా జరిగిందని తెలుపుతూ వాటిని గుర్తు చేయడం జరిగిందని తెలిపారు. కావున ప్రజలు గమనించాలని వారు కోరారు.

# షిరిడి సాయిబాబా ఆలయంలో పాదదర్శనం

**- షిరిడి సేవా సమితి**

**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణములోని పుట్టపర్తి రోడ్డు, సాయి నగర్ లోగల శిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, భక్తాదులు నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడంతో వేలాదిమంది భక్తాదులు పాద దర్శనం కోసం క్యూ కట్టక తప్పలేదు. ఈ వేడుకల్లో కాకడ హారతి, అభిషేకం, నామ సంకీర్తన, బాబా పాద దర్శనం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాలేటిలను కమిటీ వారు ఏర్పాటు చేశారు. అర్చకులు స్వామివారికి విశేషంగా అలంకరించి, పట్టు వస్త్రాలతో బాబా భక్తాదులకు దర్శనమిచ్చారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ గురు పౌర్ణమి వేడుకలు సాయిరాం అన్న నామస్మరణతో మారు మ్రోగాయి. దాదాపు 6000 మందికి పైగా అన్నదానంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో షిరిడి సాయిబాబా సేవా సమితి ప్రతినిధులు సూర్య ప్రకాష్, రాంప్రసాద్, హేమంత్ కుమార్, జెసి నాయుడు, సూర్యనారాయణ, రామలింగయ్య, వీరనారాయణ ఆలయ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, భక్తాదులకు అన్ని ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. తదుపరి వన్టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, టూ టౌన్ సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందిని ఆలయం వద్ద బందోబస్తు నిర్వహించారు. ఆలయ అలంకరణ, స్వామివారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



# మంచి మార్గం చూపువారే గురువులు

**- న్యాయవాదులు**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** మనకు ఎల్లప్పుడూ మంచి మార్గం చూపి, మంచి జీవితాన్ని ప్రసాదించు వారే గురువులు అని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు లోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురిపౌర్ణమి వేడుకలను న్యాయవాదులు ఘనంగా జరుపుకున్న రు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి గోపికృష్ణ ,కోశాధికారి అబ్దుల్, ఉపాధ్యక్షులు కరీం లతో కలిపి జూనియర్ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదులైన గురు ప్రసాద్, ఎస్. సూర్యనారాయణ, రామకృష్ణారెడ్డి, సుభద్ర, హెమ్ కుమార్, రవీందర్ రెడ్డి, నూరుల్లా, అతావుల్లా హుస్సేన్ భాష, బి. నారాయణ, రామ ప్రసాదులను ఘనంగా గురుపౌర్ణిమ పురస్కరించుకొని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మా సీనియర్ న్యాయవాదులను గురు పౌర్ణిమ సందర్భంగా సత్కరించడం మాకెంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చిందని వారు తెలిపారు. వారి సలహా సూచనలతో, సహాయ సహకారాలతో న్యాయవాద వృత్తిని ముమ్మందు మంచి అభివృద్ధి బాటలో నడుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుబ్బారావు, రాఘవేంద్ర, బాల సుందరి లతోపాటు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## జేకే పల్లిలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



ఆమడగూరు, మేజర్ న్యూస్ : మండలంలోని జెకే పల్లి, అమడగూరు, తదితర గ్రామాల్లో గురు పౌర్ణమి వేడు కలు ఆదివారం అత్యంత వైభ వంగా భక్త జన సందే హం మధ్య వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో షిరిడి సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగించి తమ భక్తి భావాన్ని చాటుకున్నా రు. జెకెపల్లి, ఆమడగూరు షిరిడి సాయిబాబా ఆల యాల్లో భక్తులు ఉదయమే ఎంతో భక్తి శ్రద్ధలతో మహిళలు ఉపవాసం ఉండి ప్రత్యేక పూజలు నిర్వహించి ,గురు పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జెకెపల్లిలోసాయిబాబా ఆల యంలో వేడుకలకు విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అం దజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులన ఉద్దేశించి ఆలయ కమిటీ సభ్యులు, షిరిడి సాయి బాబా భక్తులు మాట్లాడుతూ సమాజంలో గురువుకు అత్యుత్తమ స్థానం ఇవ్వడం మన హిందూ సంప్రదాయం అన్నారు. గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరునిగా పూజిస్తు న్నామని వారు తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

## పోతుకుంట శిరిడి సాయి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు

**– భారీ ఎత్తున పాల్గొన్న భక్తాదులు – భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు**



ధర్మవరం మేజర్ న్యూస్ : మండలంలోని పోతుకుంట గ్రామంలో షిరిసాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం అర్చకులు శ్రీని వాసులు రమణ సాయిబాబా విగ్రహాన్ని వివిధ రకాల పూలమాలలతో అం దంగా ఆలంకరించి విశేషపూజలు చేశారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన అలం కరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గురు పౌర్ణమి పురస్కరించుకునీ శిరిడి సాయిబాబా పాలదర్శన భాగ్యాన్ని భక్తులకు ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు బాబా పాద దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు. మంది భక్తులు ఈ అన్న సంతర్పణలు పాల్గొన్నారు. అనంరతం భక్తులు సాయిబాబా సం కీర్తనలు, భజనలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీరప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చే. భక్తులకు ఎటువంటి అసౌక్యం కలగకుండా వాలంటీర్లు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

## భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు



ఓబులదేవరచెరువు, మేజర్ న్యూస్ : మండల వ్యాప్తంగా పలు శిరిడి సాయి బాబా దేవాలయాల్లో ఆదివారం గురు పౌర్ణమి పురస్కరిం చుకొని, భక్తులు భక్తిశ్ర ద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను జరుపుకు న్నారు. ఉదయం నుండే శిరిడి సాయిబాబా ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు, సాయిబాబా చిత్రపటాల ఊరే గింపు, కార్యక్రమాలు కొనసాగించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. నల్లగుట్లపల్లి, గాజుగుంటపల్లి, ఒడిసి, కుంట్లపల్లి తదితర గ్రామాల్లో సాయి భజనలు జరిపారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

బుక్కరాయసముద్రం మేజర్ న్యూస్ :మండల పరిధిలోని రేకులకుంటలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుండే ప్రత్యేక పూజలతో స్వామివారిని అలంకరించి గురు పౌర్ణమి వేడుకలు కన్నుల పండుగ నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు, ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం షిరిడి సాయిబాబా చిత్రపటంతో పురవీధుల గుండా గ్రామం లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సాకే రామకృష్ణ, వెంకటేష్, తిరుపతయ్య, నాగభూషన్, నాగభూషణం, మల్లికార్జున, రుసిం గులు, వెంకటనారాయణ,మండ్లి విజయ్, నాగరాజు, రాజు,సాయి నారాయణస్వామి, ఆంజనప్ప తదితరులు పాల్గొన్నారు.



# కదిరిలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**– సాయిబాబా దర్శనానికి తరలివచ్చిన మహిళా భక్తులు**

**– భక్తులకు విరివిగా అన్నదానం**



కదిరి, మేజర్ న్యూస్ : గురు పౌర్ణమి పురస్కరించుకొని కదిరి పట్టణంలోని వాని వీధిలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు షిరిడి సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయానికి కదిరి పట్టణంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చా రు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో ప్రత్యేకంగా భారీ కెద్ల ఏర్పాటుచేసి దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజామున సాయి నాథుడికి పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల 15 నిమిషాలకు కాకడ హారతి, 7 గంటలకు మంగళ స్నానం, 7:30 కి విష్ణు సహస్ర నామావళి పారాయణం, 8 ప్రత్యేక పూజలు, 9:30 నిమిషాలకు సాయి సత్య వ్రతం, ఆపై భక్తులకు దర్శన భాగ్యం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం ఐదు గంటలకు బాబా భజనలు, ఆరు గంటలకు ధూప్ హారతి, 8 గంటలకు సీ శీజారతి నిర్వహించారు. భక్తులు సౌకర్యార్థం ఆలయం ప్రక్కన పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పక్కపక్కనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి కోనేరు వద్దనున్న శిరిడి సాయినాథని ఆలయంలో సైతం గురుపూర్ణం వేడుక లు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకోవడం జరిగింది. అలాగే హిందూపురం క్రాస్ లో ఉన్న శిరిడి సాయినాధుని ఆలయంలో సైతం వేడుకలు ఘనంగా నిర్వహిం చారు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## గురు పౌర్ణమి సందర్భంగా భక్తులకు అన్నదానం..



ముదిగుబ్బ, మేజర్ న్యూస్ : స్థానిక కాశీనాయన ఆశ్రమంలో గురు పౌర్ణమి సందర్భం గా భాగవత పాం ాయ ణము, ప్రత్యేక పూజ లు, అభిషేకా లు, అన్నదాన కార్యక్రమా లు పెద్ద ఎత్తున నిర్వ హించారు. ముద్రం రెడ్డి ఆధ్వర్యంలో భాగవత పారాయణం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సాంప్రదా యాల మేరకు అత్యం త పవిత్రమైన భాగవ తము, అష్టాదశ పురా ణాలు, వంటి పవిత్ర గ్రంథాలను మానవా ళికి అందించిన ఆది గురువు గా కీర్తించే వ్యాస మహర్షి పుట్టిన రోజును పురస్కరిం చుకొని ప్రతిఏటా ఆషాడ మాసంలో వచ్చే పౌర్ణమి నీ వ్యాస పౌర్ణమి, గురు పౌర్ణమిగా నిర్వహించు కొనడం మన ఆచా రాలలో భాగమైంది అన్నారు. స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు అన్నదాన కార్యక్రమా లు నిర్వహించి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందిం చారు. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తలు నారాయణస్వామి, వెంకటనారాయణ, వెంకటేష్, బిజెపి మండల అధ్యక్షులు ప్రకాష్ నాయుడు, ఆంజనే యులు, మార్కండే యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వ్యాస పౌర్ణమి వేడుకలు

హిందూపురం మేజర్ న్యూస్ :- వ్యాస పౌర్ణమి సందర్బంగా హిందూపురం బెస్త సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నాడు కొటిపి రోడ్డు లో గల బెస్త భవనము నందు ఆది గురువు మహాభారత భాగవతాలను, వేదాలను రచించి మానవాళికి అందించిన శ్రీ వ్యాసమహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా వ్యాసుని చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. తదనంతరం తీర్థ ప్రసాద ములు వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవా సంఘం అధ్యక్షులు బెస్త లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులు శాసనకోట ఆదినారాయణప్ప , ఉపాధ్యక్షులు టీచర్ శ్రీనివాస్, సెక్రటరీ శివయ్య, జాయింట్ సెక్రటరీ సిరికల్చర్ లక్ష్మీనారాయణ, ట్రెజరర్ అనిల్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రతినిధులు తిమ్మప్ప , రైల్వే ఆదిమూర్తి , అశ్వర్త, వరలక్ష్మి, సత్యనారాయణ, విజయలక్ష్మి ,పోలీస్ రాము , శ్రీకంఠపురం అమర్, బాబ్జి, మనోహర్, అశ్వర్త నారాయణ, రవికుమార్, లక్ష్మీనారాయణ వనజా,శివన్న, మిల్లు నారాయణస్వామి, నరసాపురం ఫణి, విప్రో రఘు భక్తాదులు పాల్గొన్నారు.



## గ్రామీణ లలిత కళలను ప్రోత్సహిద్దాం

**– పసుపు లేటి రమేష్ బాబు పిలుపు**



అమడగూరు, మేజర్ న్యూస్ : ఒకప్పుడు మారు మూల గ్రామాల సైతం లలిత కళలతో గ్రామా లు ఉట్టిపడేవని దాంతో గ్రామస్తులంతా ఎంతో ఐక్యమత్యంతో ఒకచోట చేరి లలిత కళలను,హరికథలను ఆస్వాదించే వారిని అయితే ఆనాటి లలిత కళలు రోజురోజుకు కనుమరుగవుతు న్నాయని జనసేన రాష్ట్ర నాయకులు, రాయ లసీమ సముగ్రా భివృ ద్ధి సంస్థ అధ్యక్షులు పసుపులేటి రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. రమేష్ బాబు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఫేస్ బుక్, యూట్యూబ్, ట్విట్టర్, మాయలో పడి సామాజిక కల లైన లలిత కళలు, జానపద గేయాలు, కవితలు, ఈ తరం చిన్నారులు పూర్తిగా మరిచిపోయారన్నారు. ఇప్పటికైనా మేధా వులు, రచయితలు, కవులు లలిత కళలను మారుమూల గ్రామా లకు విస్తరించి గ్రామీణ కళలను ఒక సామా జిక బాధ్యతగా వ్యవహరించి వాటిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.

## మర్తాడులో భక్తి శ్రద్ధలతో పీర్ల పండుగ

ముదిగుబ్బ, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని మర్తాడు గ్రామంలోని పీర్ల చావిడిలో కొలు వైన పీర్ల స్వాములను ఆదివారం హిందూ ముస్లింలకు చెందిన భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. గత శనివారం పీర్ల చావడిలో కొలువైన పీర్ల స్వాములను తొమ్మిదవ రోజున జలధికి తరలించడం జరుగుతుందని, ఈ తొమ్మిది రోజులు గ్రామంలో పండగ వాతావరణం నెలకొని ఉంటుందని ప్రతిరోజు స్థానికులు చుట్టుప క్కల గ్రామాల చెందిన భక్తులు స్వామివారిని సందర్శించి తమ మొక్కులు తీర్చుకుం టారని మర్తాడు సర్పంచ్ శివారెడ్డి తెలిపారు. హిందు, ముస్లింల ఐక్యతను చాటి పవిత్రమైన పండుగ పీర్ల పండగ అన్నారు. కుల మతాల కతీతంగా ప్రతి ఒక్కరూ పీర్ల స్వాము లను మొక్కుకొని తమ మొక్కులు తీర్చుకో వడం జరుగుతుందన్నారు.



## చిత్రావతి నదిలో

# అక్రమంగా ఇసుక తరలింపు!!

**– జెసిబి, ట్రాక్టర్లు సీజ్ – ఇసుక తరలింపులో టిడిపి – వైకాపా మద్దతుదారులు భాయి భాయి?**



**గోరంట్ల, మేజర్ న్యూస్ :** పట్టణ పరిధిలోని మేరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో గల స్వాగరాల వద్ద చిత్రావతి నదిలో గత వారం రోజులుగా జెసిబి ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. కొంతమంది తెలుగుదేశం నాయకులు తెరవెనుక ఉండి వారి ఆదేశాలు మేరకు తంతంగం నడుపుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతావుంది. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఓ తెలుగుదేశం పార్టీ నాయకుడు ఆదివారం పోలీసులకు సమాచారం అందించాడు. సిఐ సుబ్బారాయుడు తన సిబ్బంది తో కలసి దాడి చేసి ఒక జెసిబి, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. స్వాగరాలు ప్రాంతంలో చిత్రావతి నదికి ఒడుకు ఆనుకుని ఓ వైకాపా నాయకునికి వ్యవసాయ భూమి ఉంది. దీన్ని ఆసర చేసుకున్న కొంతమంది నాయకులు వైకాపా నాయకున్ని కలుపుకుని తెలుగుదేశం మద్దతు దారుడు అక్రమంగా ఇసుక తరలింపు స్కెచ్ వేశారు. అందరూ తెరవెనుక ఉండగా ఓ టిడిపి మద్దతుదారుడుని తెరపైకి తీసుకొచ్చారు. ఎందుకంటే వీరిద్దరూ ఒకే సామాజిక వర్గం కావడంతో వైకాపా నాయకునితో సయోధ్య కుదుర్చుకున్నారు. ఇక చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా తొలుత చిత్రావతి నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించారు. ఇలా వారం పాటు ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకున్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్న కాలేదన్న నిర్ధాణకు పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రావానా చేయాలన్న ఉద్దేశం తో చిత్రావతి నదిలో ఏకంగా జెసిబి ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వార ఇసుకను వ్యవసాయ పొలంలో డంప్ చేయడం ప్రారంభించారు. ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించడానికి డంప్ చేశారు. ఇదంతా నిశితంగా గమనించిన గోరంట్ల పట్టణానికి చెందిన ఓ టిడిపి నాయకుడు పోలీసులకు సమా చారం అందించాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఇసుక తరలిస్తున్న చిత్రావతి నది ప్రాంతానికి చేరుకున్నారు. నదిలో ఇసుకను జెసిబితో ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం కనిపించింది. వెంటనే జెసిబి, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్బరా యుడు తెలిపారు. ఎన్నికలపుడు ఇతర సందర్భాల్లో పార్టీ నాయకులు, మద్దతుదారులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, తిటుకోవడం దాడు చేసుకోవడం తరుచూ చూస్తూనే ఉంటాం. అయితే అక్రమ సంపాదనకు మాత్రం అందరూ భాయి భాయిలవుతుంటారంటే ఇదేనేమో. అయితే ఇసుకను పెద్దతున్న అక్రమ రవాణా చేసి ఇసుక డప్పులను ఏర్పాటు చేసిన సూత్రదారులను కూడ పోలీసులు అరెస్టు చేసి ఇకను కాపాడాలని పట్టణవాసులు కోరుచున్నారు.




జనం కోసమే

సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పు డైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.

ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్: 63011 07116



**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్యలో కింది మండలాల్లో
పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.
మడకశిర రూరల్, అమరాపురం, అగళి,
గుడిబండ


# 116 సీట్ల భర్తీపై వీడని అనుమానాలు..!

**– ఆ సీట్లలో సిఫార్సులకే పెద్దపీట... మెరిట్ అభ్యర్థులకు అన్యాయం**

**– డిసివో కార్యాలయం చుట్టు నేటికీ తిరుగుతున్న విద్యార్థుల తల్లితండ్రులు**

**– గత ఏడాది లాగే ఇప్పుడు కూడా సీట్ల భర్తీపై కలెక్టర్ విచారణకు ఆదేశిస్తారా ?**

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** ఉమ్మడి అనంతపురము జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి సీట్ల భర్తీపై గందోరగోళం, అనుమానాలు వీడలేదు. మూడవ విడత కౌన్సిలింగ్ తరువాత ఐదవ తరగతిలో ఖాళీలు ప్రకటించకుండా, మెరిట్ లిస్టులో తదుపరి ఉన్న విద్యార్థుల తల్లితండ్రులు సీట్లు అడిగితే లేవని, ఖాళీలు ఏర్పడితే నాల్గోవ విడత కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు ఇస్తామని చెబుతూ వచ్చినా డీసీవో కలెక్టర్ ఆమోదానికి మాత్రం 116 సీట్లతో కూడిన జాబితా పంపడమే వివాదమవుతుంది. ఈ జాబితాలో డీసీవో సిఫార్సు లేఖలకే పెద్ద పీట వేయడంతో... మెరిట్ లిస్ట్‌లో తరువాత స్థానంలో ఉన్న విద్యార్థులకు, పక్క జిల్లాలో సీట్లు పొంది బదిలీలో ఇక్కడ సీటు తెచ్చుకుందామనుకున్న విద్యార్థులు అన్యాయం జరిగిందని వారి తల్లితండ్రులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకులాల్లో ఐదవ తరగతి ,ఇంటర్మీడియెట్ ప్రవేశాల్లో సీట్ల కోసం స్పందనలో ప్రజా సంఘాల నుంచి వినతులు, కలెక్టర్‌కు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్యేలు సిఫార్సులు పెద్ద ఎత్తున వస్తుండటంతో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమర్ స్పందించి మెరిట్ విద్యార్థులకు ఎక్కడ అన్యాయం జరగకుండా,దళిత సంఘాలు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సిఫార్సులు లేఖలను, పేదరికంతో బాధపడుతున్న అర్ఫన్, సెమి అర్ఫన్ పిల్లలను కూడా పరిగణలోకి తీసుకుని అందులో కూడా విద్యార్థుల మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ చేయాలని డీసీవోను ఆదేశించారు. ఎంపీ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ప్రజా సంఘాలకు, అర్ఫన్, సెమి అర్ఫన్ పిల్లలకు ఇన్ని సీట్లే ఇవ్వాలని కలెక్టర్ ఎక్కడ సంఖ్య కూడా చెప్పలేదు. అయితే డీసీవో కలెక్టర్ ఆమోదంకు పంపిన 116 సీట్ల జాబితా ఎంపికనే పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.

**మెరిట్ ఆధారంగా చేశామంటున్న 46 సీట్ల భర్తీలో నిజమెంత?**

ఐదవ తరగతిలో మూడవ విడత కౌన్సిలింగ్ తరువాత ఏర్పడిన 116 సీట్లలో 46 సీట్లు విద్యార్థులు మెరిట్ ఆధారంగా భర్తీ చేశామని డీసీవో చెబుతున్నారు.అయితే మెరిట్ జాబితాను రాష్ట్ర కార్యాలయం అధికారులు కాకుండా జిల్లా కార్యాలయంలోనే ఉద్యోగులే తయారు చేయడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. మెరిట్ ప్రకారం మూడవ విడత కౌన్సిలింగ్‌లో 21 మార్కులు కటాఫ్ కాగా,తరువాత మెరిట్ లిస్ట్ ఉన్న విద్యార్థులకే ఆ 46 సీట్లు కచ్చితంగా ఇచ్చారో స్పష్టత లేదు. ఈ జాబితా తయారీ కూడా జిల్లా కార్యాలయ ఉద్యోగులు డీసీవో కార్యాలయంలో కాకుండా బయట గురుకుల పాఠశాలల్లో కూర్చోని జాబితా తయారు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గురుకులాల్లో మెరిట్ ఆధారంగానే సీట్ల భర్తీ పారదర్శకంగా జరుగుతుందని, ఒక్క సీటు ఖాళీ ఏర్పడిన కూడా ప్రకటన ఇచ్చి కౌన్సిలింగ్‌కు పిలిచి సీటు ఇస్తామని, నా చేతుల్లో ఏమి లేదని, మెరిట్ లేకుండా సీటు ఇస్తే కలెక్టర్ నన్ను సస్పెండ్ చేస్తారని ? మీకు సీటు ఇచ్చి నాకు ఉద్యోగాన్ని ఇబ్బందుల్లో పెట్టలేనని, సీట్ల కోసం ఆర్జీలతో తీసుకువచ్చిన పేద విద్యార్థుల తల్లితండ్రులతో డీసీవో చెప్పిన మాటలు. ఈ మాటలు వింటే డీసీవో ఎంత నిజాయితీ అధికారో అర్థమవుతోంది.ఇంతా నిజాయితీ అధికారి ఆ 46 సీట్లు భర్తీ కూడా నాల్గోవ విడత కౌన్సిలింగ్ నిర్వహించి మెరిట్ విద్యార్థులకు సీట్లు సీట్లు నిజాయితీని నిరూపించుకోవచ్చు.. అలా కాకుండా డీసీవో కార్యాలయ ఉద్యోగులే మెరిట్ జాబితాను తయారు చేసి సీట్ల భర్తీ చేయడం గమనార్హం.

అర్ఫన్, సెమి అర్ఫన్ పిల్లలకు 20 సీట్లు ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో అర్ఫన్, సెమి అర్ఫన్‌లకు ఐదవ తరగతిలో 20 సీట్లు ఇచ్చామని డీసీవో చెబుతున్నారు.అసలు ఐదవ తరగతి సీట్ల కోసం సెమి అర్ఫన్, అర్ఫన్ల పిల్లల సీట్ల కోసం ఎన్ని ఆర్జీలు వచ్చాయి. డీసీవో కార్యాలయ ఉద్యోగులు ఎన్ని ఆర్జీలు పరిశీలించారు, వాటిని విచారణ చేసి అర్హుల సీట్ల ఎంపిక ఏ ప్రతిపాదికన చేశారన్న వాటిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం 20 మంది విద్యార్థులనే ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో అంతుపట్టడం లేదు.స్పందన, డీసీవో కార్యాలయానికి కార్యాలయానికి ఆర్జీలు ఇచ్చిన అర్ఫన్, సెమి అర్ఫన్ల పిల్లలకు కూడా అనేక మంది పిల్లలకు సీట్లు రాక వారి తల్లితండ్రులు నేటికి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీన్ని బట్టి చూస్తే డీసీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు తరచూ కార్యాలయానికి వచ్చిన, తెలిసిన వారికే సీట్లు ఇచ్చారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల సిఫార్సులకు 54 సీట్లు**

ఐదవ తరగతిలో సీట్ల కోసం మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, రాజకీయ పార్టీలు, దళిత సంఘాల సిఫార్సుల లేఖలను కూడా పరిశీలించి అందులో కూడా మెరిట్ మార్కులను పరిశీలించి విద్యార్థులకు 54 సీట్లు ఇచ్చామని డీసీవో చెబుతున్నారు. అయితే ఇందులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ఎన్ని సిఫార్సులు లేఖలు, దళిత సంఘాల నాయకుల నుంచి మొత్తం ఎన్ని సిఫార్సు లేఖలు వచ్చాయో స్పష్టత లేదు. దళిత సంఘాలకు ఒక్కో సంఘానికి ఒక్క సీటే ఇచ్చినట్లు సంఘాల నాయకులు చెబుకుంటున్నారు. ఈ 54 సీట్లల్లో మంత్రులు,ఎంపీ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫార్సుల లేఖలు ఇచ్చిన విద్యార్థులకు ఎన్నీ సీట్లు ఇచ్చారు, దళిత సంఘాల సిఫార్సు లేఖలు ఇచ్చిన విద్యార్థులకు ఎన్ని సీట్లు ఇచ్చారో స్పష్టత లేదు. దళిత సంఘాల్లో సిఫార్సులు లేఖలు ఇచ్చిన తమకు అనుకూలమైన సంఘాల వారికే డీసీవో సీట్లు ఇచ్చారని, జిల్లాలో అనేక దళిత సంఘాల సిఫార్సులకు మెరిట్ జాబితా ప్రకారం కూడా విద్యార్థులకు సీట్లు ఇవ్వలేదని డీసీవో పై మరికొన్ని దళిత సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. మంత్రులు, ఎంపీ,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫార్సులు లేఖలపై డిసివోపై ఇలాంటి విమర్శలే వస్తున్నాయి. గత ఏడాది కూడా అంబేద్కర్ గురుకులాల్లో సీట్ల భర్తీలో అక్రమాలు, అవకతకాలు జరిగాయని విచారణ జరపాలని అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అప్పటి కలెక్టర్ ప్రత్యేక కమిటి వేసి సీట్ల భర్తీపై విచారణ జరిపించారు. మరలా ఈ సంవత్సరంలో సీట్ల భర్తీపై దళిత సంఘాలు, విద్యార్థుల తల్లితండ్రుల నుంచి ఆరోపణలు వస్తుస్తున్నాయి. ఈ సంవత్సరం కూడా ప్రస్తుత జిల్లా కలెక్టర్ సీట్ల భర్తీకు విచారణ జరిపిస్తే నిజనిజాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# చేనేత కార్మికులను ఆకలి చావుల నుండి కాపాడండి

**-ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** చేనేత కార్మికులను ఆత్మహత్యలు ఆకలి చావుల నుండి కాపాడాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడినటువంటి ఎన్డీఏ ప్రభుత్వమైన ఆత్మహత్యలు ఆకలి చావులు లేకుండా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ధర్మవరంలో నిబంధనలకు విరుద్ధంగా పవర్ లూమ్స్ మగ్గాలను ప్రోత్సహించి, చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా చేశారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒక ధర్మవరంలోనే 40 మందికి పైగా చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగింది అని, కానీ గత ప్రభుత్వంలో కేవలం 15 మందికి 5 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించారు, మిగిలిన వారికి కూడా ఎక్స్గ్రేషియా చెల్లించాలని వారి డిమాండ్ చేశారు. కానీ ఇప్పటికీ చేనేత కార్మికులు ఉపాధి కరువై, ఆత్మహత్యలు వలసలకు వెళ్తున్నారు అని, రెండు రోజుల కిందట ధర్మవరం శివానగర్ కు చెందిన నారాయణస్వామి అనే చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం జరిగింది అని తెలిపారు. 21వ తేదీ కూడా కూడా యాడికి మండలంలో చంద్ర అనే చేనేత కార్మికులు కూడా ఆత్మహత్య చేసుకుని మరణించడం జరిగింది అని బాధని వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా చేనేత కార్మికులకు చేతినిండా ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే చేతివృత్తులను పరిరక్షించేందుకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి పూర్తి పరికరాలను ఆయా వృత్తిదారులకు అందించాలన్నారు. అదేవిధంగా 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి, చేనేత ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని, చేనేతకు ప్రత్యేక బ్యాంకులను ఏర్పాటు చేసి, సబ్సిడీ రుణాలను అందించి, చేనేత కార్మికుల జీవన ఉపాధికి తోడ్పాటున అందించాలని, అర్హులైన చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలం మంజూరు చేసి, పక్కా గృహం, వర్క్ షెడ్ ను ప్రభుత్వం ఉచితంగా నిర్మించి ఇవ్వాలని, సిల్క్ రాయితీని రూ.2వేల నుంచి రూ.3వేలుకు పెంచి ఇవ్వాలని, చేనేతకు నెలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ నుఅందించాలని, నేతన్న నేస్తాన్ని రూ.36వేలకు పెంచి, మగ్గం నేసే ప్రతి కార్మికునికి, ఉపవృత్తుల వారికి వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

# చిగిచెర్లలో ఘనంగా జలధి మహోత్సవం



**ధర్మవరం మేజర్ న్యూస్:** మండలపరిధిలోని చిగిచెర్ల గ్రామంలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. పెద్దకాశీంస్వామి, చిన్నకాశీంస్వామి, మౌలాలిస్వామి, కుల్లాలు స్వామి పీర్లకు ముల్లాసాబ్ ప్రత్యేకప్రార్థనలు చేశారు. గ్రామస్తులు పెద్దఎత్తున చక్కెరచదివింపులు, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఉదయం పీర్లు బేటీ తీసుకున్నాయి. అనంతరం సాయం %×% త్రం గుండం పూడ్చివేసి పీర్లను ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బంధువులతో రాకతో పీర్లమకాన్ ప్రాంగణం కిటకిటలాడింది. యువకులు, మహిళలు, వృద్ధులు సైతం నాయిబ్రహ్మణుల మేళాతాళాలునడుమ, తప్పెట్ల సందడితో ఉత్సాహంగా గుండంచుట్టూ అలాన్ తొక్కుతూ సందడిచేశారు. కులమతాలకు అతీతంగా ఎంతో సంబరంగా గ్రామస్తులంతా ఏకమై పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు కృష్ణారెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్రెడ్డి, సుబ్బప్పగారి ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పీర్ల పండుగకు గుండం ఏర్పాటు



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో పీర్ల పండుగ జరుపుకోవడానికి సోమవారం పాత ఊరు సావిడి దగ్గర అగ్నిగుండం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు సమావేశమై తెలియజేశారు. ఆదివారం పట్టణంలోని కాలమ్మ గుడి వద్ద అన్ని కులాల పెద్దలు సమావేశమై నేటి నుండి సావిడి ముందు గుండం ఏర్పాటు చేసి పీర్లకు ప్రత్యేక పూజలు అలంకరణలో ఏర్పాటు చేస్తూ ఆదివారం జెలిది కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రామంలోని కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరు హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏజీ నరసింహులు, నారాయణస్వామి, ఆకుల రమణ, యాడికుల్లాయప్ప, కోతుల నరసింహమూర్తి, రామాంజనేయులు, వడ్డే సురేష్, శ్రీనివాసులు, నరేష్ ఉత్తప్ప తదితరులు ఉన్నారు

## అంగరంగ వైభవంగా

# షిరిడి సాయిబాబా గురు పౌర్ణమి వేడుకలు

**-వేలాదిగా తరలివచ్చిన భక్తాదులు**



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా గుడి వద్ద అంగరంగ వైభవంగా 17వ గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆదివారం మండల వ్యాప్తంగా సాయిబాబా భక్తులలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుండి ప్రత్యేక పూజలు ప్రత్యేక అలంకరణ, హోమాలు, హారతులు, నిర్వహిస్తూ అశేష జనా వాహినితో సాయినాథుడి గుడి ఆవరణమంతా కిటకిటలాడింది. గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తాదులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు. సాయినాధుని దర్శించుకున్న ప్రతి ఒక్కరూ తీర్థప్రసాదాలు తీసుకొని భోజనాలను పూజిస్తూ ఇంత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ వారికి మేజర్‌న్యూస్ ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సాయిబాబాకు సింహాల ప్రభావాలని స్థానిక సప్తగిరి కాలనీ వాసులు వితరణ చేశారు. సోమశేఖర్ కుటుంబ దంపతులకు భక్తాదులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అదేవిధంగా సింహాల ప్రభావవలి వితరణ చేసిన దంపతులకు ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ వారు శాలువాలతో ఫోటో బహుకరణ చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఐ మురళీకృష్ణ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ వారు, భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఘనంగా

# గురు పౌర్ణమి వేడుకలు



**గోరంట్ల, మేజర్ న్యూస్ :** గురు పౌర్ణమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మహిళలు ప్రజలతో దేవాలయాలు కిటకిటలాడాయి. గోరంట్ల పట్టణంలోని వినాయక నగర్ లో గల షిరిడి సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని బూడిదగడ్డ పల్లి వద్ద గల షిరిడి సాయిబాబా దేవాలయంలో ప్రతి ఏడాది ఆనవాయితీగా నిర్వహిస్తున్న గురు పౌర్ణమి వేడుకలను పెద్ద ఎత్తున భారీ భక్తుల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుండి రాత్రి వరకు బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు వాలంటీర్లు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేట్లు ఏర్పాటు చేసి, షిరిడి సాయి నాధుని దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. షిరిడి సాయిబాబా దేవాలయం వద్ద సిఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.



# గురుపూజతో వ్యక్తి జీవితం సార్థకమవు తుంది

**-మైదుకూరు ఆంజనేయులు**



**తాడిపత్రి మేజర్ న్యూస్:** గురుపూజ వలన వ్యక్తి జీవితం సార్థకమవు తుంది అని మైదుకూరు ఆంజనేయులు అన్నారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నటరాజు ని శాలువా కప్పి సన్మానించి, పాదాభి నమస్కారాలతో గురు దీవెనలు పొందారు.గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుః బ్రహ్మా గురుః విష్ణు గురుర్దేవో మహేశ్వరః అనే భావం గురువులకి త్రిమూర్తులతో సమానమైన స్థానాన్ని ఇచ్చిన గొప్ప సంస్కృతి మనది అన్నారు. అలాగే మాతృదేవోభవ ! పితృదేవోభవ ! ఆచార్యదేవోభవ, అనే భావం తల్లిదండ్రుల తర్వాత బాధ్యత గురువుకు పంపిణీ గొప్ప సాంప్రదాయం మన సంస్కృతి అన్నారు. గురు అన్న రెండు అక్షరాలలో 'గు' అనగా తమస్సు లేదా చీకటి. 'రు' అనగా చీకటిని తొలగించే వాడు. గురువు వ్యక్తిలోని అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి, జ్ఞానం అనే జ్యోతితో వెలుగు నింపేవాడు నిస్వార్థ గురువు అన్నారు.

## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

నల్లమాడ, మేజర్ న్యూస్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తులు ప్రజలు ఉపవాస దీక్షలతో ఘనంగా నిర్వహించుకున్నారు. గత మూడు రోజులు గా నల్లమాడలో సాయి బాబా మందిరంలో ప్రత్యేక అలంకరణలతో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది నూతన ఏర్పాట్లు చేశారు. గురు పౌర్ణమి సందర్భంగా షిరిడి సాయిబాబా దర్శనం కోసం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉదయం నుండి సాయంత్రం దాకా నిర్వహించారు. ప్రత్యేకంగా డ్రమ్స్ వాయిద్యాలతో వాయిద్యాలతో పూజలు నిర్వహించారు. సాయి బాబా ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ కార్య క్రమాలు నిర్వహిం చారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి పూజల నిర్వహించు కున్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



బుక్కరాయసముద్రం మేజర్ న్యూస్ :ఎ మండల పరిధిలోని రేకులకుంటలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుండే ప్రత్యేక పూజలతో స్వామివారిని అలంకరించి గురు పౌర్ణమి వేడుకలు కన్నుల పండుగ నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు, ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం షిరిడి సాయిబాబా చిత్రపటంతో పురవీధుల గుండా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సాకే రామకృష్ణ, వెంకటేష్, తిరుపతయ్య, నాగభూషన్, నాగభూషణం, మల్లికార్జున, రుసింగులు, వెంకటనారాయణ,మండ్లి విజయ్, నాగరాజు, రాజు,సాయి నారాయణస్వామి,ఆంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్..



కదిరి, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడ రేషన్, శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యం లో యుటిఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా సీనియర్ నాయకులు, కీ"శే" జి.రామాంజనేయులు (రిటైర్డ్ హెచ్ఎం) వారి జ్ఞాపకార్థం, జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ ను పెనుకొండ పట్టణం లోని ప్రభత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదా నంలో టోర్నమెంట్ కన్వీనర్ జి సి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటి మ్యాచ్ అమ రాపురం - రొద్దం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రొద్దం జట్టు నిర్ణీత 12 ఓవర్స్ కి 154 పరుగులు చేశారు, చేదనలో అమరాపురం జట్టు 52 పరుగులు మాత్రమే చేసింది. 63 పరుగులు తేడాతో రొద్దం జట్టు గెలుపొందింది. ఈ మ్యాచ్ లో మెన్ అఫ్ ది మ్యాచ్ రామాంజి నేయులు ను ఎంపిక చేశారు.మధ్యాహ్నం రెండవ మ్యాచ్ కదిరి - మడకశిర మధ్య జరిగింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మడకశిర జట్టు 12 ఓవర్స్ కి 104 పరుగులు చేశారు.చేదనలో కదిరి జట్టు 86 పరుగులు మాత్రమే చేసింది . మడకశిర జట్టు 19 పరుగుల తేడా తో గెలుపొందింది. మడకశిర జట్టు లో మెన్ ఆఫ్ ది మ్యాచ్ గా మంజు ని ఎంపిక చేశారు. మూడవ మ్యాచ్ గుడిబండ - నంబూలపూలకుంట మధ్య జరిగింది. టాస్ గెలిచిన గుడిబండ జట్టు మొదట బాటింగ్ చేసి 12 ఓవర్స్ లో 103 పరుగులు చేసిం ది. చేదనలో యన్ పి కుంట జట్టు 7 వికెట్ల తేడా తో గెలుపొం దింది.ఈ మ్యాచ్ లో మ్యాచ్ యోగి ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లాప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శులు తాహిర్ వలి,జి వి నరేష్ కుమార్, సీనియర్ నాయకులు అజామ్ భాష , డివిజన్ నాయ కులు గంగాధర్, శివ య్య, ఆది జినేష్, మారుతీ, శేషాద్రి, ఉపేంద్ర, నాగార్జున రెడ్డి, కాశీ, వంశీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతు పనులు..



కదిరి, మేజర్ న్యూస్: మున్సిపల్ పరిధిలో ని ఐదవ వార్డులో రోడ్డు అద్వానస్థితికి చేరుకుంది. రోడ్డు అద్వానస్థితికి చేరు కోవడంతో వెంటనే మున్సిపల్ కమిషనర్ పంపి రోడ్డు సమగ్రమైన నివేదిక ఇవ్వా లని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగింపు, గుంతలను పూడ్చి వేయడం, చెత్తాచెదారాన్ని జెసిబి సాయంతో మున్సిపల్ కమిషనర్ తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో పాటించాల్సి మహేంద్ర నాయకులు రాజా, రమణ, కుసుమ కుమార్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలి..

### పూలే అంబేద్కర్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ప్రముఖులు



**అనంతపురం విద్య, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ కళాశాల, పాఠశాలలలో చదివి ఉన్నతస్థాయికి చేరుకున్న విద్యార్థులు మీరు కూడా చేతనైనంతలో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాల, పాఠశాలలలో ఇంటర్, పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు మహాత్మా పూలే చారిటబుల్ ట్రస్టు, రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వారి అధ్వర్యంలో పూలే అంబేద్కర్ ప్రతిభా పురస్కారాలను ఆదివారం అనంతపురం నగరంలోని నక్కారామారావు యాదవ భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మహాత్మా పూలే చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పోతుల నాగరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, డాక్టర్ మహేష్, రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ నాయక్ లు పాల్గొని మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సుమారు 20 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అందిస్తున్నామని, అందరికి చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తూ, పై చదువులు చదువుకోవడానికి పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిభా పురస్కారాలు కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలలలో ప్రతిభ కనబరిచిన అన్ని వర్గాల వారికి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిభా పురస్కారాలను సుమారు వందమంది విద్యార్థులకు నగదు తో పాటు, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ, ఓబీలేసు, శంకర్, వరద రాజులు, రవిశంకర్, శ్రీరాములు సాకే హరి, వెంకట్రాముడు, అది, పుట్టా శ్రీధర్, ఎర్రిస్వామి కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## యోగా గురువులకు సన్మానం



అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : గురు పూర్ణిమ పురస్కరించుకుని వివేకానంద యోగా కేంద్ర ఆధ్వర్యంలో నగరంలోని వివిధ యోగ కేంద్రాలలో ఉచితముగా యోగ బోధిస్తున్న యోగ గురువులకు ఆదివారం కమ్మ భవన్లో సన్మానం నిర్వహించారు. గురువులు ధనుంజయ , సాయంత్రము కమ్మ భవన్ యోగా, కోడూరు సుధాకర మూర్తిని ,గురురాజా రావులకు పూలమాలలు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగా కేంద్ర అధ్యక్షులు ఎం.రాజశేఖర్ రెడ్డి , మారుతి ప్రసాద్ ,ఆంజనేయులు ,దివాకర్ ,పుల్లయ్య,వెంకటేశ్వర గుప్త మొదలగు అందరూ కలిసి అక్కడ యోగ సాధకులు సదాశివన్, రామాంజనేయులు కమ్మ భవన్ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. కమ్మ భవన్ శిబిరంలో గత పది సంవత్సరముల నుండి ప్రతిరోజు ఉదయం 5:30 నుండి 7 గంటల , సాయింత్రము 5.30 గంటల నుండి 6.45గంటల వరకు ఉచిత యోగ తరగతులను వినియోగించుకోవాలని కమ్మ భవన్ నాయకులు నాగన్న, సరిపూటి సూర్య నారాయణ , సుధాకర్ బాబు,మాసినేని రామయ్య,నారాయణ తెలిపారు. ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# మైనారిటి గురుకుల పాఠశాలల్లో సరిపడ గదులు లేక విద్యార్థుల అవస్థలు..

- మెట్లపైనే పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, బకెట్లు - సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి - ఏఐఎస్ఎఫ్



**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** గార్లదిన్నె మైనారిటి గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడ గదులు లేక అవస్థలు పడుతున్నారు. పడుకోవడానికి గదుల్లో స్థలం చలడం లేదు. కనీసం విద్యార్థుల పుస్తకాలు, బకెట్లు, ట్రంక్ పెట్టెలు పెట్టుకోవడానికి స్థలాలు లేక పాఠశాలల్లో మెట్లపైనే పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య గార్లదిన్నె గురుకుల పాఠశాల సందర్శనలో అనేక సమస్యలను గుర్తించారు. విద్యార్థులతో మౌళిక సదుపాయాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో 426 మంది విద్యార్థులు ఉండగా సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో మినరల్ వాటర్, మరుగుదొడ్లను, ప్రహరీ గోడ సమస్యలు ఉన్నాయన్నారు. విద్యార్థులు దుప్పట్లు,కాస్మోటిక్ చార్జర్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలి,సరిపడు తరగతు గదులను ఏర్పాటు చేయాలని డిమాండ్చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ కార్యదర్శి నవీన్, నాయకులు సాయికుమార్, జయ,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గురువును నిత్యం పూజించాలి..

### - డాక్టర్ నిర్మల మురళి



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : మనకు విద్యాబుద్ధులు నేర్పే గురువును నిత్యం పూజించాలని నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా కోవూరు నగర్ లో ఆదివారం శ్రీ స్వామి దయానంద సేవా ఆశ్రమంలో స్వామి సత్యాత్మనంద ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆశ్రమంలో పేద విద్యార్థులకు ఉచిత వసతి కల్పిస్తున్న నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా గురువు యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. గురు పౌర్ణమి రోజు గురువుకు ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలి అన్న అంశాలను నిర్మలమురళి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## శివ బాలయోగి మహరాజ్ ఆశ్రమంలో గురు పౌర్ణమి వేడుకలు

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : అనంతపురం శివ బాలయోగి మహారాజ్ ఆశ్రమంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వామివారి పాదుకులతో పల్లకి సేవ నిర్వహించారు. భక్తుల స్వహస్తాలతో అభిషేకం గావించారు. గోవిందా భజన మండలి, వాసవి భజన మండలి, శివ బాలయోగి భజన మండలి వారిచే సమష్టిగా భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు జాన దీక్ష అనంతరం మహా మంగళహారతి అన్నప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమంలో జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ విశ్వనాథ్ మల్లికార్జున ప్రసాద్ చెన్నకేశవులు నాగభూషణం సుబ్బారావు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం



హిందూపురం మేజర్ న్యూస్: పట్టణం లోని నేతాజీ నగర్ కి చెందిన ఇబ్రహీం అనారోగ్యంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నాడు అయితే ఆయన ఆర్థిక పరిస్థితులు చాలా దుర్భర స్థితిలో ఉండడంతో సిపిఐ హిందూపురం పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ ఇబ్రహీం ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.6500 ఆర్థిక సహాయాన్ని ఇబ్రహీం తల్లికి అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడమే కాకుండా ప్రజలకు ఇబ్బందులు వచ్చినప్పుడు తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి సిపిఐ పార్టీ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీం కుటుంబ సభ్యులు వినోద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, పట్టణ కార్యవర్గ సభ్యులు మారుతి రెడ్డి, జబివుల్లా, కమల్ భాష,గంగాధర్, శ్రీనివాసులు, బాబా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలి..

### –వీసీకె పార్టీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్

అనంతపురము రూరల్మేజర్ న్యూస్ : వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోని ఎస్సీ,ఎస్టీ సబ్ప్లాన్కు, బీసీ,మైనారిటి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలని వీసీకె (విముక్తి చిరుతల కక్షి) పార్టీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కళ్యాణదుర్గం పట్టణంలోని ఆర్అండ్బి గెస్ట్హౌస్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా బహుజనుల అభివృద్ధిని విస్మరించడంతో, ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. ఆ పార్టీ అధినేతకు జగన్మోహన్ రెడ్డి ప్రజలలో తిరిగే హర్హత కోల్పోయారన్నారు.ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తారని సంపూర్ణంగా నమ్మకం ఉందని వీసీకె పార్టీ (విముక్తి చిరుతల కక్షి) రమేష్ పేర్కొన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేయడంతో పాటు రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కమక్కపల్లి మరెన్న, కన్వీనర్ కొండాపురం శ్రీనివాసులు, శెట్టూరు మండల ఇంచార్జ్ మహాలింగా, కంబధురు ఇంచార్జ్ నరసింహాలు, చాపిరి నాగరాజు,గరుడాపురం రవి, మనోజ్, రాజు, రామన్న తదితరులు పాల్గొన్నారు.



# నగరంలో భగవాన్ వ్యాస మహర్షి జయంతి వేడుకలు

## – గోసేవ బృందం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, శోభాయాత్ర

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** భగవాన్ వ్యాస మహర్షి జయంతిని నగరంలోని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయములో ఆదిశంకరాచార్యులు, దత్తత్రేయులకు వేదపండితులు సుంకేశుల సత్యనారాయణ, బ్రాహ్మణ వేద పాఠశాల విద్యార్థులచే అభిషేకము, వేద పఠనము గావించారు. ఈ కార్యక్రమానికి అలయ వ్యవస్థాపకులు హెూసూరు రామసుబ్రమణ్యం సహాయ సహకారములతో గోసేవ బృందం వారిచే నృత్య కోలాట ప్రదర్శనలతో ఆదిశంకరులు, దత్తాత్రేయుల నగర శోభా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమములో అంతర్ రాష్ట్రీయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్చార్జ్ (ప్ర.భా.రి) యర్రగుంట్ల శ్యాంసుందర్ ముఖ్య అథితి పాల్గొని మాట్లాడుతూ భగవాన్ వేదవ్యాసులు ఈ కలియుగ ప్రపంచానికి వేదాలను భారత భాగవతాలను అష్టాదశ పురాణాలను అందించి ప్రజలను సన్మార్గంలో ఉంచడానికి వేద పురాణాలను అందించడం జరిగిందన్నారు. దీనిని ఆది గురువులు అయిన శ్రీ ఆదిశంకరాచార్యులు సులభతరంగా అన్నివర్గాల వారికి భక్తి మార్గాన్ని చూపించారన్నారు. ధర్మం, అధర్మం, ఈ రెండింటిని మానవుడు విచక్షణతో ఎంచుకునే మార్గాలగా అందించారని కొనియాడారు. ఈ



కార్యక్రమములో అంతరాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మఠం ఆనంద్ కుమార్, రాష్ట్రీయ భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు భూదేటి అమరా బాబు , కార్యకర్తలు కృష్ణకుమార్ గౌడ్, మధుబాబు, తదితర కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యారంగాభివృద్ధిలో ఫోర్టోను భాగస్వామ్యం చేయాలి

### – విద్యాశాఖ మంత్రికి పోర్టో విజ్ఞప్తి

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : ఫోర్టో(ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) తో సమావేశము ఏర్పాటు చేసి విద్యారంగ అభివృద్ధి, అభ్యున్నతిలో "ఫోర్టో" ను భాగస్వామ్యం చేయవలసిందిగా విద్యాశాఖ మంత్రికి ప్రకటన ద్వారా చైర్మన్ కరణం హరికృష్ణ , సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య, ముఖ్య సలహాదారులు గాండ్లపర్తి శివానందరెడ్డి, మీడియా కన్వీనర్ గరికపాటి సురేష్, అధికార ప్రతినిధులు బోనెల రమేష్ , మాగంటి శ్రీనివాసరావులు విజ్ఞప్తి చేశారు. ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ ) లో 16



రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలు సభ్య సంఘాలుగా ఉన్నాయన్నారు. సమస్యలు లేని విద్యా రంగాన్ని ఫోర్టో ( ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) అభిలషిస్తోందని తెలిపారు. విద్యారంగం అభివృద్ధిలో సంపూర్ణ భాగస్వామ్యం కావాలని కోరుకొంటోందని వివరించారు. కావున ఫోర్టో భాగస్వామ్య సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, విద్యారంగ అభివృద్ధి, అభ్యున్నతిలో భాగస్వామ్యం వహించేందుకు తోడ్పడవలసిందిగా కోరారు.

# ఆలయ అభివృద్ధికి కృషి : దాదేం మధురెడ్డి, బయప రెడ్డి

నల్లచెరువు, మేజర్ న్యూస్ : ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రముఖ ఎన్ఆర్లు దాదేం మధు రెడ్డి, బయప రెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. మండలానికి చెందిన వారు వృతిపరంగా విదేశాల్లో స్థిరపడ్డ ప్రముఖ ఎన్.ఆర్.ఐ లు మదురెడ్డి. బయప రెడ్డిలు తెలిపారు. ఆహ్వానం మేరకు ఆదివారం మండల కేంద్రములోని గీతా మందిరం యందు ప్రత్యేక పూజలు కువారు హాజరయ్యారు. ఆలయ కమిటీ అభివృద్ధి చెర్మెన్ డాదెం వెంకట శివారెడ్డి మర్యాద పూర్వకంగా వారిని ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వారిని దృశ్యాలువులతో సన్మానించారు. దాతలు మాట్లాడుతూ ఆలయ అభివద్ధికి నిరంతరం మాతండ్రి దాదెం శివారెడ్డి ఆధ్వర్యంలో ముందుకు సాగుతా మని, మండల వ్యాప్తంగా నీరు పేద విద్యార్థులకు సాయం అందిస్తామని తెలి పారు.

ఇప్పటి వరకు ప్రముఖ యన్. ఆర్. ఐ లు చేసిన సేవలుకు పలువురు అభిమా నులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో వారి కుటుంబ సభ్యులు దాదేం సరితా రెడ్డి, హెన్యరెడ్డి. అఖిల్ రెడ్డి.శరణ్య రెడ్డి, కుషల్ రెడ్డి, బూచిపల్లి నరహింహా రెడ్డి, విన్నిరెడ్డి, జీవన్ రెడ్డి, టీడీపి నాయకులు గిలిట్ వెంకట రమణ, గొల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్వి

## – కుటుంబ సమేతంగా హైదరాబాద్లోని ఎమ్మెల్యే దగ్గుపాటి ఇంటికి తేజస్వి

## – పార్టీ విజయం కోసం తేజస్వి చాలా కృషి చేశారన్న ఎమ్మెల్యే..

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : తెలుగు ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్వి తెలుగుదేశం పార్టీ విజయం కోసం చాలా కృషి చేశారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. హైదరాబాద్ లోని తన నివాసానికి ఆదివారం తేజస్వి కుటుంబ సమేతంగా వచ్చారు. దగ్గుపాటి సతీమణి శ్రీలక్ష్మి, కుమార్తె దగ్గుపాటి ఆశ్రిత వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం దగ్గుపాటి ఇంట్లో ఇరు కుటుంబాల వారు అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో జరిగిన అంశాల గురించి చర్చించారు. తన విజయం కోసం ఆ రోజు హైదరాబాద్ లో సమావేశం నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి అనేక మంది కృషి వలన నాతో పాటు పార్టీకి ఘన విజయం లభించిందని



దగ్గుపాటి అన్నారు. టికెట్ వచ్చినప్పుడు తక్కువ సమయం ఉన్నా.. ప్రజల్లోకి మీరు బాగా వెళ్లారని తేజస్వి అన్నారు. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో పాటు మీరు పడిన శ్రమ వలనే పార్టీకి మంచి విజయం దక్కిందని ఎమ్మెల్యే దగ్గుపాటితో తేజస్వి అన్నారు.